

పరిపాలన పట్టాలెక్కేదెప్పుడు?

తిరుపతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాలనకు, అభివృద్ధికి సారధ్యం వహించేదెవరు? అధికార పార్టీని, పాలనను నడిపించేదెవరు? జిల్లాకు మంత్రి పదవి దక్కని నేపథ్యంలో నాయకత్వమూ కరువైన వేళ అందరిలో కదలాడుతున్న ప్రశ్నలివి. మరోవైపు జిల్లాలో అధికారుల బదిలీలు, నియామకాల ప్రక్రియ సైతం మొదలు కాలేదు. అసెంబ్లీ సమావేశాలు జరిగి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేశాక అధికారికంగా ఎమ్మెల్యేలు నియోజకవర్గాల పాలనపై దృష్టి సారించనున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం సైతం జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారుల బదిలీలు, నియామకాల ప్రక్రియ చేపట్టనుంది. దీంతో గత మార్చిలో ఎన్నికల షెడ్యూలు విడుదలైన నాటి నుంచీ స్తంభించిన జిల్లా పాలన తిరిగి పట్టాలెక్కేందుకు మరింత వ్యవధి పట్టే అవకాశముంది.

రాష్ట్ర మంత్రివర్గం పూర్తిస్థాయిలో ఏర్పాటైపోయింది. ఇంకా ఒకరిని మంత్రిగా నియమించేందుకు సాంకేతికంగా అవకాశం వుంది కానీ నియమిస్తారో లేదో తెలియని పరిస్థితి.దీంతో జిల్లా నుంచీ ఎవరికైనా మంత్రి పదవి వస్తుందన్న ఆశలైతే ప్రస్తుతానికి లేవు. అందువల్ల జిల్లాలో ప్రభుత్వ పాలనకు, అభివృద్ధికి నాయకత్వం ఎవరు వహిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారుతోంది. అసెంబ్లీ మొదటి సమావేశాల అనంతరం ఇంచార్జి మంత్రుల నియామకం జరుగనుంది. ఆ క్రమంలో జిల్లాకు కూడా ఇంచార్జి మంత్రి రానున్నారు. అయితే ఇంచార్జి మంత్రి అడపాదడపా మాత్రమే జిల్లాకు వచ్చి వెళ్ళే పరిస్థితి వుంటుంది. అదే జిల్లాలోనే మంత్రి వుంటే రెగ్యులర్‌గా ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలును పర్యవేక్షించే అవకాశముంటుంది. జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించడంతో పాటు అమలుకు ప్రయత్నించే వీలుంటుంది. నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యేలు జిల్లాస్థాయిలోనే మంత్రిని ఆశ్రయించి పనులు చేసుకునే వెసులుబాటు వుంటుంది. మరో కోణంలో చూస్తే అధికార పార్టీకి కూడా జిల్లాలో నాయకత్వం కరువైన పరిస్థితి కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి కొందరు ఎమ్మెల్యేలు అమరనాథ రెడ్డిని, మరికొందరు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని ఆశ్రయిస్తున్నారు. నెల్లూరు నుంచీ జిల్లాలో కలసిన గూడూరు, వెంకటగిరి, సూళ్ళూరుపేట నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించిన మంత్రి నారాయణను ఆశ్రయించే పరిస్థితి. ఫలితంగా తిరుపతి జిల్లాకంటూ ఓ అధికార కేంద్రం లేకుండా పోయింది.టీడీపీకి కూడా తగిన నాయకత్వం అందుబాటులో లేకుండా పోతోంది.

బదిలీలు, నియామకాలు కొలిక్కి వస్తేనే...

గత మార్చి 16న ఎన్నికల షెడ్యూలు వెలువడిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయింది. మే 13న పోలింగ్ జరగగా ఈనెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు పూర్తయింది. ఈ మేరకు మార్చి నుంచీ జిల్లాలో ప్రభుత్వ పాలన మందగించింది. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారితే జిల్లాస్థాయి నుంచీ మండల స్థాయి వరకూ అధికార యంత్రాంగం బదిలీలకు లోనుకావడం సర్వ సాధారణంగా జరిగేదే. దానికనుగుణంగా ఇపుడు జిల్లాలో కూడా కలెక్టర్, ఎస్పీలు మొదలుకుని జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారుల బదిలీలు జరగనున్నాయి. సీఎం ఇష్టాయిష్టాల మేరకు కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్ తదితరుల నియామకం జరుగుతుంది. ఇక మిగిలిన జిల్లా, డివిజన్ స్థాయి అధికారుల నియామకం జిల్లాలో ఎమ్మెల్యేల సిఫారసు మేరకు జరగనుంది. అదే విధంగా ఎన్నికల ముందు బదిలీపై వచ్చిన డిప్యూటీ కలెక్టర్లు, డీఎస్పీలు, తహసిల్దార్లు, సీఐలు, ఎస్ఐలు తిరిగి పూర్వ జిల్లాలకు బదిలీపై వెళ్ళనున్నారు. ఆయా స్థానాల్లోకి కొత్త అధికారులు రానున్నారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల కమిషనర్లదీ అదే పరిస్థితి. వీరిలో ఎవరు జిల్లాలోనే కొనసాగుతారో ఎవరు బదిలీపై వెళతారో ఇదమిద్ధంగా చెప్పలేని పరిస్థితి. ప్రస్తుతానికి టీటీడీకి మాత్రమే రెగ్యులర్ ఈవో నియమితులయ్యారు. నెలాఖరుకు గానీ ఈ బదిలీలు, నియామకాలు ఒక కొలిక్కి వచ్చే అవకాశం లేదు. అవన్నీ పూర్తయ్యాక గానీ జిల్లాలో పాలన పట్టాలెక్కే పరిస్థితులు కనిపించడం లేదు.

24 నుంచీ ఏపీఆర్‌సెట్ ఇంటర్వ్యూలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 18: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశానికి నిర్వహించిన ఏపీఆర్‌సెట్ ఇంటర్వ్యూలు ఈ నెల 24 వ తేదీ నుంచీ చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏపీఆర్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి. దేవప్రసాదరాజు మంగళవారం తిరుపతిలో వెల్లడించారు. 24 నుంచీ 28 వ తేదీ వరకూ ఇంటర్వ్యూల ప్రక్రియను నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలోని ఎంపిక చేసిన 12 యూనివర్సిటీల్లో ఇంటర్వ్యూలు చేపడుతున్నట్టు తెలిపారు. 10 వేల మంది ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేయగా, ఇందులో 4,352మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ఉత్తీర్ణులైన వారికి ఆయా యూనివర్సిటీల్లోని సంబంధిత డిపార్ట్‌మెంట్లలోనే ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. సమగ్ర వివరాల కోసం.. హెచ్‌టీటీపీఎస్.సెట్స్.ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.గవర్నమెంట్, ఇన్.. వెబ్‌సైట్ చూడాలని కన్వీనర్ దేవప్రసాదరాజు కోరారు.

వయోవృద్ధుల దర్శనంపై పుకార్లను నమ్మొద్దు: టీటీడీ

తిరుమల, జూన్18(ఆంధ్రజ్యోతి):తిరుమలలో వయోవృద్ధుల దర్శనానికి సంబంధించి తప్పుదోవ పట్టించే కొన్ని వార్తలు సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నాయని టీటీడీ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ' రోజూ వెయ్యిమంది వయోవృద్ధులకు, దివ్యాంగులకు దర్శనాలకు సంబంధించి టీటీడీ ప్రతి నెలా 23వ తేది మధ్యాహ్నం 3 గంటలకు మూడు నెలల ముందుగానే ఆన్‌లైన్ కోటాను విడుదల చేస్తోందని తెలిపింది. ప్రస్తుతం ఆన్‌లైన్ టికెట్లు ఆగస్టు నెల వరకు బుక్కయ్యాయని పేర్కొంది. టికెట్ పొందిన వ్యక్తికి రూ.50విలువ చేసే లడ్డూ ఉచితంగా లభిస్తుందని,తిరుమల నంబి ఆలయానికి ఆనుకుని ఉన్న సీనియర్ సిటిజన్(పీహెచ్‌సీ) లైన్ ద్వారా రోజూ మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారని వివరించింది.కాబట్టి సోషల్‌మీడియాలో ప్రచారమవుతున్న తప్పుడు వార్తలను నమ్మవద్దని టీటీడీ కోరింది. దీనికి సంబంధించిన వివరాల కోసం 'తిరుమల.ఓఆర్జీ', 'టీటీదేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్' అనే వెబ్‌సైట్లను సంప్రదించాలని సూచించింది.

నేటినుంచి శ్రీవారి జ్యేష్టాభిషేక ఉత్సవాలు

తిరుమల, జూన్18(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం నుంచి మూడురోజుల పాటు జ్యేష్టాభిషేక ఉత్సవాలు జరుగనున్నాయి. అభిషేకాలు, పంచామృత స్నపన తిరుమంజనాల కారణంగా శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు వైఖానస ఆగమోక్తంగా నిర్వహించే ఉత్సవమే జ్యేష్టాభిషేకం. మొదటిరోజు ఉత్సవమూర్తులకు హోమాలు, అభిషేకాలు, పంచామృత స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. తర్వాత స్వామి, అమ్మవార్లకు వజ్రకవచాన్ని అలంకరించి మాడవీధుల్లో ఊరేగిస్తారు. రెండవరోజు ముత్యాల కవచ సమర్పణ చేసి ఊరేగిస్తారు. మూడవరోజు కూడా తిరుమంజనాదులు పూర్తిచేసి బంగారు కవచాన్ని సమర్పించి ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ బంగారు కవచాన్ని మళ్లీ వచ్చే ఏడాది జ్యేష్టాభిషేకంలోనే తీస్తారు. అంతవరకూ శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి బంగారు కవచంతోనే ఉంటారు. కాగా, జ్యేష్టాభిషేకం కారణంగా శ్రీవారి ఆలయంలో జూన్21వ తేదీ కల్యాణోత్సవ, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవ సేవలను టీటీడీ రద్దు చేసింది. తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు.

ఏపీ పీజీఈ సెట్‌లో 90.44 శాతం ఉత్తీర్ణత



చైతన్య



వంశీ



మహేశ్వరి



భవిష్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 18: ఫార్మసీ, ఇంజనీరింగు పీజీ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ పీజీఈ సెట్-2024 ఫలితాలను ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి మంగళవారం తిరుపతిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. గత నెల 29 నుంచీ 31వ తేదీ దాకా పరీక్షలు నిర్వహించామన్నారు. 13 సబ్జెక్టులకు 10,143 మంది దరఖాస్తు చేశారన్నారు. వీరిలో 8706 మంది పరీక్షలు రాశారని తెలిపారు.90. 44 శాతం అంటే 78744 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు.ఫలితాల కోసం..హెచ్‌టీటీపీఎస్.సెట్స్.ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపి.గవర్నమెంట్.ఇన్. పీజీసెట్స్. వెబ్‌సైట్ చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీపీజీఈసెట్ కన్వీనర్ రమాశ్రీ, వర్సిటీ మీడియా కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా ర్యాంకర్లు వీరే

నానో టెక్నాలజీ విభాగంలో తిరుపతి నగరం జీవకోనకు చెందిన ఎ.వంశీ 42మార్కులతో 5వ ర్యాంకును, ఎస్.మహేశ్వరి 41మార్కులతో 6వ ర్యాంకును సాధించారు. అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లెకు చెందిన జి.భవిష్య కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగు విభాగంలో 74మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు, చిత్తూరు రైల్వే క్వార్టర్స్‌కు చెందిన వై.చైతన్య 71మార్కులతో మూడవ ర్యాంకును సాధించారు.

రియాలిటీ హాట్ స్పాట్ సిటీగా తిరుపతి



దేశవ్యాప్తంగా 17 ప్రతిపాదిత నగరాలు

దక్షిణాదిన 4 నగరాల్లో తిరుపతికి చోటు

తిరుపతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలుగా విలసిల్లుతున్న 17 నగరాలు రానున్న కాలంలో రియల్ ఎస్టేట్ రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందడానికి అవకాశముందని కొలియర్స్ ఇండియా సంస్థ ప్రకటించిన జాబితాలో తిరుపతికి చోటు దక్కింది. రియల్ ఎస్టేట్ రంగంలో విశేష పేరు ప్రఖ్యాతులున్న ఈ సంస్థ దేశవ్యాప్తంగా అధ్యయనం నిర్వహించి రూపొందించిన నివేదికను తాజాగా విడుదల చేసింది. దీనికోసం దేశం మొత్తం మీద రియల్ ఎస్టేట్‌పరంగా అత్యధిక గ్రోత్ రేట్ వున్న వందకు పైగా నగరాలలో అధ్యయనం కొనసాగించింది. వాటిలో ముందు వరుసలో నిలిచిన 30 నగరాలను ఎంపిక చేయగా అందులో ఆధ్యాత్మిక పర్యాటక రంగం కేటగిరీ కింద 17 నగరాలను గుర్తించింది. ఈ 17 నగరాల్లో అయోధ్య, వారణాసి, పూరి, ద్వారక, షిర్డి, అమృత్‌సర్ తదితరాలతో పాటు తిరుపతి కూడా వుండడం గమనార్హం. ఇక్కడ ఆధ్యాత్మిక పర్యాటకం, మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులు వంటివి అభివృద్ధి చెందడానికి అవకాశముందని కొలియర్స్ సంస్థ అభిప్రాయపడింది. వీటి మూలంగా రియల్ ఎస్టేట్ రంగం సైతం గరిష్టంగా అభివృద్ధి చెందడానికి వీలు కలుగుతుందని అంచనా వేసింది. రియల్ ఎస్టేట్ హాట్‌స్పాట్ సిటీస్‌గా ఒకటిగా సంబంధిత సంస్థ గుర్తించిన తిరుపతి దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 17 నగరాల్లో ఒకటి కాగా అదే దక్షిణ భారతదేశం నుంచీ ఎంపికైన నాలుగు నగరాల్లో ఒకటి కావడం విశేషం. దక్షిణాదిన కోయంబత్తూరు, కొచ్చిన్, తిరుపతి, విశాఖపట్టణం ఎంపికయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, రోడ్డు కనెక్టివిటీని పెంచడం, నూతన విమానాశ్రయాలను ఏర్పాటు చేయడం, ప్రత్యేక రైలు సర్వీసులు నడపడం వంటి చర్యలు తీసుకుంటే దీర్ఘకాలికంగా అటు ఆతిధ్య రంగంలోనూ, ఇటు రియల్ ఎస్టేట్ రంగంలోనూ అనూహ్య అభివృద్ధి సాధ్యమవుతుందని కొలియర్స్ ఇండియా సంస్థ భావిస్తోంది.

ఇప్పటికే ఊపందుకున్న నగర విస్తరణ

ఇప్పటికే తిరుపతి నగరం అర్బన్ మండల పరిధిని దాటి రూరల్ మండలం, చంద్రగిరి, రేణిగుంట, వడమాలపేట, రామచంద్రాపురం, ఏర్పేడు మండలాల్లోకి విస్తరించిన సంగతి తెలిసిందే. తిరుపతి కేంద్రంగా పరిసరాల్లోని ఈ మండలాల్లోకి నగరం వేగంగా విస్తరిస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు ఊపందుకుంటున్నాయి. తిరుపతి నుంచీ కడప, నెల్లూరు, చెన్నై, చిత్తూరు, మదనపల్లె వెళ్ళే మార్గాలు జాతీయ రహదారులు కావడం రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందడానికి ఊతమిస్తోంది. తిరుపతి ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో పాటు చుట్టుపక్కల అనేక చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ఆలయాలు వుండడంతో పలువురు ఉన్నత స్థాయి వ్యక్తులు సైతం విశ్రాంత జీవితాన్ని తిరుపతి, తిరుపతి పరిసరాల్లో గడిపేందుకు ప్రాముఖ్యత ఇస్తున్నారు. దీనివల్ల ఇక్కడ స్థలాలు కొనుగోలు చేసి నివాసాలు ఏర్పరుచుకోవడం, అపార్టుమెంట్లలో ఫ్లాట్లు కొనుగోలు చేయడం క్రమేపీ పెరుగుతోంది. దీనివల్ల అపార్టుమెంట్ల సంఖ్య కూడా ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది. తాజాగా కొలియర్స్ ఇండియా సంస్థ వేసిన అంచనాల ప్రకారం చూస్తే రానున్న కాలంలో నగర విస్తరణ మరో స్థాయిని అందుకోవడం ఖాయమనిపిస్తోంది.

ఆదేశాల అమలేదీ?

తోతాపురి ధరపై కలెక్టర్లు చెప్పినా పట్టించుకోని పల్ప్ ఫ్యాక్టరీలు,వ్యాపారులు

పుత్తూరు అర్బన్, జూన్ 18: తోతాపురి రకం మామిడిని టన్ను రూ.30 వేలకు తక్కువ కాకుండా కొనుగోలు చేయాలని ఆదివారం తిరుపతి, చిత్తూరు కలెక్టర్లు పల్ప్ ఫ్యాక్టరీ యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలిచ్చినా అమలుకు నోచుకోలేదు. టన్ను రూ.21-22 వేలకు మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ధర పెంచి... అమాంతం తగ్గించి...



పల్ప్ ఫ్యాక్టరీలు విరివిగా ఉపయోగించే తోతాపురి రకం ధర పుత్తూరు మార్కెట్‌లో ఈ ఏడాది ఆశాజనకంగానే ప్రారంభమైంది. తొలుత రూ.20 వేల నుంచి ప్రారంభమై ఈ నెల 4వ తేదీకి రూ.28 వేలకు చేరుకుంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా మామిడి దిగుబడి పూర్తి తగ్గిపోయింది. సరాసరి 20 శాతం కూడా దిగుబడి రాకుండాపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న అరకొర పంటను మార్కెట్‌కు తరలించి పెట్టుబడిలో కొంతైనా రాబట్టుకుందామనుకున్న రైతులకు నిరాశే మిగిలింది. ధరను చూసి కోతలు ప్రారంభించడంతో మార్కెట్ వర్గాలు ధరను అమాంతం తగ్గించేశాయని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం టన్ను కాయలను పల్ప్ ఫ్యాక్టరీలు రూ.22 వేలకు కొనుగోలు చేస్తుండగా, వ్యాపారులు మాత్రం మండీల్లో రూ.21 వేలు చెల్లిస్తున్నారు. సాధారణంగా సీజన్ ముగింపు సమయానికి ధరలు పెరిగే అవకాశం ఉన్నప్పటికీ సిండికేట్ కారణంగా ఆ ఆశ కూడా లేకుండా పోయిందని రైతులు ఆరోపిస్తున్నారు.

వారికిది మామూలే....

గత ఏడాది కూడా తోతాపురి ధర రూ.10 వేలకు పడిపోవడంతో చిత్తూరు కలెక్టర్ జోక్యం చేసుకున్నారు. సీజన్ ప్రారంభంలోనే రూ.19వేలకు కొనుగోలు చేయాలని పల్ప్ ఫ్యాక్టరీ యాజమాన్యాలకు స్పష్టం చేశారు. ఆ ఆదేశాలు అమలు కాకపోవడంతో రూ.15 వేలకు కొనుగోలు చేయాలని సూచించారు.ఆ ఆదేశాలనూ ఫ్యాక్టరీ యాజమాన్యాలు పట్టించుకోలేదు. దీంతో వ్యాపారులు చెప్పిన ధరకే పంటను రైతులు అమ్ముకోవాల్సి వచ్చింది. ఇప్పుడు ఇద్దరు కలెక్టర్లు ఆదేశించినా పల్ప్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు, వ్యాపారులు పట్టించుకోలేదు. కలెక్టర్ల ఆదేశాలను అమలు చేయడంలో ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులు విఫలమయ్యారని రైతులు వాపోతున్నారు. మండీలు, ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్ద అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు ధరలను తగ్గించేస్తున్నారంటున్నారు.పది రోజుల్లో సీజన్ ముగియనుంది.ఇప్పటికే పంట నేల రాలిపోతుండడంతో వ్యాపారులు నిర్ణయించిన రూ.21 వేలకే రైతులు విక్రయించాల్సివస్తోంది.

ఆరేళ్లుగా సంక్షోభమే

2018లో మామిడి ధరలు పతనమయ్యాయి. అప్పటి టీడీపీ ప్రభుత్వం చొరవ తీసుకుని కిలో మీద రూ.2.50 ఇచ్చి రైతులను ఆదుకుంది. 2019లో అకాల వర్షాలతో పంట దెబ్బతింది. 2020, 2021 సంవత్సరాల్లో కరోనా కారణంగా ఎగుమతి చేసుకోలేని పరిస్థితి. 2022లో దిగుబడి లేకుండా పోయింది.2023లో దిగుబడి వచ్చినా ఫ్యాక్టరీలు సిండికేట్‌గా మారి కనీస మద్దతు ధర ఇవ్వలేదు. ఇప్పుడేమో వాతావరణ ప్రతికూల పరిస్థితులతో దిగుబడి 20శాతానికి పడిపోయింది.సిండికేట్ కారణంగా ధరలు మరింత తగ్గాయి.



అమ్మవారికి బోనాలు తీసుకెళుతున్న మహిళలు

వైభవంగా ముత్యాలమ్మ జాతర

భాకరాపేట, జూన్ 18: చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటలో ముత్యాలమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టి.. బోనాలు సమర్పించారు. చలిమిడితో దీపాలు తయారు చేసి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

‘ఉపాధి’లో గుట్టుగా సోషల్ ఆడిట్

ప్రభుత్వం మారడంతో అధికారుల గుండెల్లో గుబులు

ఎర్రావారిపాలెం, జూన్ 18: ఉపాధి హమీ పథకంలో జరిగిన పనులకు ప్రతి ఏడాదీ ఆర్థిక సంవత్సరం ముగింపున సోషల్ ఆడిట్ బహిరంగా జరపాలి. కానీ వైసీపీ హయాంలో ఐదేళ్లుగా మండల స్థాయి ఆడిట్‌ని గుట్టుగా కానిచ్చేశారన్న ఆరోపణలున్నాయి. పైగా సమావేశాలు జరిగినట్లు సంతకాలతో రికార్డులు రహస్యంగా తయారై పోయినట్లు సమాచారం. ఇపుడు ప్రభుత్వం మారడంతో సంబంధిత అధికారులు తమ అవినీతి కప్పి పుచ్చుకోవడానికి నానా పాట్లు పడుతున్నారు. దీనికోసం ఎమ్మెల్యే నానీని ప్రసన్నం చేసుకోవడానికి విఫలయత్నాలు చేస్తున్నారు. అయితే భారీగా అవినీతికి పాల్పడి, ప్రజలను జలగల్లా పీడించిన అధికారులను తన దగ్గరకు ఎమ్మెల్యే రానీయడం లేదు. దీనికితోడు మండల టీడీపీ నాయకులు ఉపాధి పథకం బిల్లుల నకలు తమకు కావాలని ఏపీవోను కోరారు. మండల స్థాయి నాయకులను అనుకూలంగా మార్చుకోవడానికి ఇతర మండలాల్లో తమకు తెలిసిన వారి ద్వారా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మొత్తానికి వైసీపీ నాయకుల మాటలు విని అవినీతికి కొమ్ము కాసిన అధికారుల గుండెల్లో గుబులు మొదలైంది.

హథీరాం బావాజీ జయంత్యుత్సవం



ఉత్సవాల్లో పాల్గొన్న భానుప్రకాశ్‌రెడ్డి, శివానాయక్

తిరుపతి రూరల్, జూన్ 18: వేదాంతపురం పంచాయతీ పరిధి విద్యుత్ నగర్‌లో ఉన్న హథీరాం బావాజీ ఆలయంలో మంగళవారం బావాజీ జయంత్యుత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా బావాజీ విగ్రహానికి ప్రత్యేక పూజలు, శాస్త్రోక్తంగా హోమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన బీజేపీ నేత, టీటీడీ పాలకమండలి మాజీసభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. తిరుమల శ్రీవారి ప్రియశిష్యుడు, బంజారాల ఆరాధ్య దైవమైన బావాజీకి ప్రపంచంలోనే తొలుతగా తిరుపతిలో చేపట్టిన ఆలయ నిర్మాణ భూమి పూజలో తాను పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఈ ఆలయ నిర్మాణానికి టీటీడీ, కేంద్రప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ, సహకారం అందించేందుకు పరిశీలిస్తామని తెలిపారు. సాయంత్రం బంజారా సంప్రదాయ పద్ధతిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయధర్మకర్త భుక్యా శివానాయక్, అధ్యక్షుడు ఎం.చలపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలి

రామచంద్రాపురం, జూన్ 18: అంగన్వాడీ పిల్లలకు పౌష్టికాహారం అందజేయాలని సూపర్‌వైజర్ రేవతి కోరారు. రాయలచెరువుపేట అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం బడిబాట కార్యక్రమం జరిగింది. పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు.

మూతబడ్డ స్కూళ్లను తెరవండి

ఎమ్మెల్యే పులివర్తి నానీ ఆదేశం



ఎర్రావారిపాలెం, జూన్ 18 :మూతబడ్డ పాఠశాలలను తిరిగి తెరవండని విద్యాశాఖ అధికారులను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ ఆదేశించారు.ఎర్రావారిపాలెంలో ని మోడల్ స్కూల్లో విద్యార్థులకు బ్యాగులు ,పాఠ్యపుస్తకాలు, యూనిఫాం దుస్తులతో కూడిన కిట్లను ఆయన మంగళవారం పంపిణీ చేశారు.ప్రభుత్వ పాఠశాలలు ఏ ఒక్కటీ మూత పడేందుకు వీల్లేదన్నారు.డీవైఈవో బాలాజి, ఎంపీడీవో మధుసూదన రావు, ఎంఈవోలు సతీష్ బాబు, సుబ్రమణ్యం ,సర్పంచ్ ఎల్లమ్మ, టీడీపీ, జనసేన నాయకులు రఘునాథ, మహేష్ నాయుడు,అన్నాసముద్రం మధు,శివరామి రెడ్డి,దేవర మనోహర్, ద్వారక నాథ, మునిరత్న నాయుడు,దేవి, చిన్నపరెడ్డి,నిరంజన్ రాయల్, అశోక్ రెడ్డి, కుమారస్వామి, విశ్వనాథ రెడ్డి,కొమ్మక లక్ష్మీదేవి, వేణుగోపాల్, గోపి,శిరివేలు రఘు, సుధాకర్ నాయక్, సురేంద్రబాబు, శ్రీధర్ నాయుడు,కల్పరవి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే జీవితంలో ఉన్నతస్థాయి:నాని



విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి రూరల్, జూన్ 18:విద్యతోనే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోగలమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లె జడ్పీహైస్కూల్లో మంగళవారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను ఆయన పంపిణీ చేశారు.డ్రాపవుట్స్ లేకుండా టీచర్లు చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలకు కాంపౌండ్‌వాల్, ఫర్నిచర్, గ్రౌండ్ మరమ్మతులు వంటి అంశాలను టీచర్లతో పాటు టీడీపీనేతలు తన దృష్టికి తెచ్చారని, విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. డీఈవో శేఖర్, డీవైఈవో బాలాజి, ఎంఈవోలు, టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు డాలర్స్ దివాకర్‌రెడ్డి, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు కత్తిసుధాకర్, బడి సుధాయాదవ్, సర్పంచ్ జోగి మోహన్, బిరుదాల భాస్కర్‌రెడ్డి, దొడ్ల కరుణాకర్‌రెడ్డి, ఉసిరిపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గోడ కూలి వ్యక్తి మృతి



బాబు మృతదేహం

చంద్రగిరి, జూన్ 18: నరసింగాపురం పంచాయతీ రెడ్డివారి నాదమునిరెడ్డి కాలనీలో గోడ కూలి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భార్య చనిపోవడంతో బాబు(58) తన తల్లి ఇంద్రమ్మతో కలిసి కాలనీలోని ఓ పూరి గుడిసెలో ఉండేవాడు. సోమవారం రాత్రి వీరు నిద్రిస్తుండగా భారీ వర్షం కురిసింది. రాత్రి 11 గంటల సమయంలో ఇంటి గోడ కూలి బాబుపై పడింది. దీంతో ఆయన కేకలు వేయగా స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం 108 వాహనంలో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మూడు గంటలకు మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రగిరి


పేరంటాళ్ల వేషంలో మిట్టమీద గంగమ్మ



చంద్రగిరి, జూన్ 18: చంద్రగిరిలో మిట్టమీద గంగమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు పేరంటాళ్ల వేషంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం పేరంటాళ్ల అమ్మవారి వేషంలో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి విశ్వరూప దర్శనం కల్పించారు. ఆలయ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఉభయదారులు, స్థానికులు పాల్గొన్నారు.

తెప్పలపై సుందరరాజస్వామి అభయం

రేపు అమ్మవారికి గజవాహనసేవ





తిరుచానూరు, జూన్ 18: పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామి తెప్పలపై కొలువుదీరి పద్మసరోవరంలో విహరించి భక్తులకు అభయమిచ్చారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారికి కేటీ మండపంలో నేత్రపర్వంగా అభిషేకం జరిగింది. సాయంత్రం సర్వాలంకార శోభితులైన శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామిని ఆలయం నుంచి అమ్మవారి పుష్కరిణి వద్దకు వేంచేపు చేసి.. తెప్పలపై కొలువుదీర్చారు. ఉభయ దేవేరిలతో కలిసి స్వామివారు పద్మసరోవరంలో మూడు చుట్లు తిరిగి భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం నుంచి మూడ్రోజులపాటు పద్మసరోవరంలోని నీరాడ మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తికి సాయంత్రం స్నపన తిరుమంజనం జరగనుంది. గురువారం రాత్రి అమ్మవారికి గజవాహనసేవ, శుక్రవారం రాత్రి గరుడ వాహనసేవ జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరిటెండెంట్లు మధు, శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్ నాయుడు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



సర్వదర్శన క్యూలైన్

తిరుమలలో మోస్తరు భక్తుల రద్దీ





క్యూలైన్ నుంచి నీరు తీసుకుంటున్న భక్తురాలు - వడ్డించేవారు లేక క్యూలైన్ పక్కనే ఉండిపోయిన అన్నప్రసాదాలు

- శ్రీవారి సర్వదర్శనానికి 20 గంటలు

తిరుమల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ మంగళవారం కూడా కొనసాగింది. శని, ఆదివారంతోపాటు సోమవారం వరుస సెలవులు రావడంతో తిరుమల క్షేత్రం సోమవారం మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ కిక్కిరిసింది. మధ్యాహ్నం నుంచి దాదాపు మూడు కిలోమీటర్లు ఉన్న క్యూలైన్ ఒక కిలోమీటరుకు తగ్గింది. అదే తరహాలో మంగళవారం మోస్తరు భక్తుల రద్దీ నెలకొంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం వరకు వ్యాపించింది. వీరికి సుమారు 20 గంటల దర్శన సమయం పడుతోంది. కాగా, క్యూలైన్‌లోని భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు అందజేసే సిబ్బంది, శ్రీవారి సేవకులు కొన్నిచోట్ల కనిపించకపోవడం గమనార్హం. దీంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.

ఇంటర్ ద్వితీయ సప్లిమెంటరీలో 59శాతం ఉత్తీర్ణత

- ఫస్టియర్, బెటర్‌మెంట్ ఫలితాలు 26న
- ఇకపై రీకౌంటింగ్ ఉండదన్న అధికారులు

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ద్వితీయ సంవత్సరంలో 59శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఆన్‌లైన్ మూల్యాంకనంతో జరిగిన జాప్యం వల్ల కేవలం ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాలను ఇంటర్ విద్యామండలి మంగళవారం విడుదల చేసింది. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వీవీ సుబ్బారావు వివరాలు వెల్లడించారు. జనరల్ కోర్సుల విద్యార్థులు 115319 మంది పరీక్షలు రాయగా 68070(59శాతం) ఉత్తీర్ణులయ్యారని, ఒకేషనల్ విద్యార్థులు 11871మందికిగాను 6798 (57శాతం) ఉత్తీర్ణత సాధించారని వివరించారు. మొత్తంగా 58.86శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. కేటగిరీల వారీగా చూస్తే అబ్బాయిలు 59శాతం, అమ్మాయిలు 58శాతం మంది పాసయ్యారు. ఈ ఏడాది పబ్లిక్ పరీక్షలతో కలిపి చూస్తే జనరల్ విద్యార్థులు 87శాతం మంది, ఒకేషనల్ విద్యార్థులు 84శాతం మంది సెకండియర్‌లో ఉత్తీర్ణులై బయటకు వెళ్లారని తెలిపారు. ఈ ఏడాది సప్లిమెంటరీ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో మూల్యాంకనం చేశామని, అందువల్ల రీకౌంటింగ్ ఉండదని పేర్కొన్నారు. డిజిటల్ విధానంలో కౌంటింగ్ పొరపాట్లు రావన్నారు. రీవెరిఫికేషన్ కావాలంటే ఈనెల 20 నుంచి 25లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఒక్కో పేపరుకు రూ.వెయ్యి ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇకపై రెగ్యులర్ పరీక్షల మూల్యాంకనం కూడా ఆన్‌లైన్‌లోనే చేయనున్నట్లు వివరించారు. సప్లిమెంటరీ ఉత్తీర్ణతలో జిల్లాల వారీగా చూస్తే జనరల్ కేటగిరీలో పార్వతీపురం మన్యం,అల్లూరి సీతారామరాజు, పల్నాడు జిల్లాలు టాప్‌లో ఉన్నాయి.పశ్చిమ గోదావరి, కోనసీమ, కృష్ణా జిల్లాలు చివరన నిలిచాయి. ఒకేషనల్‌లో పార్వతీపురం మన్యం, నెల్లూరు, శ్రీకాకుళం ముందుండగా, కడప, కర్నూలు, విశాఖపట్నం అట్టడుగున ఉన్నాయి. కాగా ఫస్టియర్ సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ ఫలితాలను ఈనెల 26న విడుదల చేస్తామని తెలిపారు.

పులికాట్ స్థితిగతులపై జూలై 19న ప్రజాభిప్రాయ సేకరణ



సమావేశ ఉత్తర్వులను అందజేస్తున్న కిషోర్

తడ, జూన్ 18 : పులికాట్ తీరప్రాంత నిర్వహణ, అభివృద్ధిపై ప్రజాభిప్రాయ సేకరణకు జూలై 19న నేలపట్టులో సభను ఏర్పాటు చేస్తామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనలిస్టు కిషోర్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన ఎంపీపీ కొలవి రఘురెడ్డి, ఎంపీడీవో మురళీకృష్ణలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సభకు తీరప్రాంత ప్రజలు హాజరయ్యేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పులికాట్ సరస్సు తీర ప్రాంత ప్రస్తుత పరిస్థితులపై నివేదిక తయారుచేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డును కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ ఆదేశించిందన్నారు. తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, చిట్టమూరు, వాకాడు, కోట, చిల్లకూరు మండలాల తీరప్రాంత ప్రజల నుంచి వివరాలు సేకరించేందుకు సభను నిర్వహించనున్నామన్నారు. అభ్యంతరాలు సూచనలను ప్రజలు ప్రస్తావించవచ్చన్నారు. ఆమేరకు ప్రజలకు అవగాహన కల్పించేలా పంచాయతీ కార్యదర్శులు చొరవ తీసుకోవాలన్నారు. మండల ఉపాధ్యక్షుడు వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు గాబ్రియల్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పునఃప్రారంభమైన కోర్టులు

తిరుపతి(లీగల్), జూన్ 18: వేసవి సెలవులు అనంతరం కోర్టులు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. సివిల్, క్రిమినల్ కేసులు ఇకపై యథాతథంగా జరుగుతాయి. నెల రోజులుగా ప్రాధాన్యమైన క్రిమినల్ కేసులు మాత్రమే జరిగాయి. కోర్టులు తెరవడంతో తిరుపతిలోని 18కోర్టులు.. న్యాయవాదులు, కక్షిదారులతో కిటకిటలాడాయి. గత నెల 17న మృతి చెందిన సీనియర్ న్యాయవాది దామోదరశర్మ సంస్మరణ సభ మూడో అదనపు జిల్లా జడ్జి గురుమూర్తి అధ్యక్షతన కోర్టు చాంబర్‌లో జరిగింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.గోపీచంద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

గో హత్యకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బజరంగ్ దళ్ నేతలు

తిరుపతి (వైద్యం), జూన్ 18: గో హత్యకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ నేతలు కిరీటిరెడ్డి, విష్ణు ప్రతీక్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. గోసంరక్షణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాగే కొనసాగితే సహించేది లేదన్నారు. గోహత్యలు, వాటి మాంసం తినడం వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నేతలు రమాదేవి, విజయలక్ష్మి, సంతోష్, రామన్ తదితరులు పాల్గొన్నారు.

మీ బిడ్డలకైతే ఇలాంటి అన్నం పెడతారా?

- కుళ్లిపోయిన కూరగాయలు
- పిడచ కట్టిన అన్నం, నీళ్లను తలపించే రసం
- 80మంది పిల్లలకు అన్నమే లేక ఆకలి కేకలు
- గురుకుల వసతిగృహంలో దారుణ పరిస్థితులు
- విద్యార్థుల పరిస్థితి చూసి చలించిపోయిన బృందమ్మ



ముద్ద కట్టిన అన్నాన్ని పరిశీలిస్తున్న బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి, జూన్ 18: శ్రీకాళహస్తి పట్టణం తెలుగుగంగకాలనీలోని గురుకుల పాఠశాల వసతిగృహంలో దారుణ పరిస్థితులు వెలుగులోకి వచ్చాయి. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ మంగళవారం రాత్రి వసతి గృహాన్ని తనిఖీ చేశారు. కుళ్లిపోయిన కూరగాయాలు పిడచ కట్టిన అన్నం, సాంబారు లేకుండా నీళ్లను తలపించే రసంతో భోజనం, వీటన్నింటికి తోడు 80మంది పిల్లలకు అసలు అన్నమే లేకపోవడం.. గాఢ అంధకారంలో బాలికల అవస్థలను ఆమె గుర్తించి అధికారులను నిలదీశారు. 2014 వరకు శ్రీకాళహస్తి పట్టణంలో వసతిగృహాల నిర్వహణ అత్యంత దయనీయంగా కొనసాగింది. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అప్పటి మంతి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ వసతి గృహాలను తనిఖీ చేసి సమస్యలను గుర్తించారు. ఎంతో శ్రమించి వసతిగృహాల నిర్వహణను గాడిలో పెట్టారు. ఆ తరువాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు వసతిగృహాల నిర్వహణపై కనీసం దృష్టి సారించలేదు. మళ్లీ పిల్లలకు మెరుగైన సేవలు అందించాలన్న ఆశయంతో రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కాసాగార్డెన్, ఇంటిగ్రేటెడ్ వసతి గృహాలను తనిఖీ చేశారు. అక్కడి పరిస్థితులను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఎమ్మెల్యే తల్లి బృందమ్మ మంగళవారం తెలుగుగంగ కాలనీలోని గురుకుల పాఠశాల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఇక్కడ చీకట్లో బాలికలు అవస్థలు పడుతూ భోజనం చేస్తున్న దృశ్యాలను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. జనరేటర్ ఉన్నా ఎందుకు మరమ్మతులు చేయలేదని నిలదీశారు. చాలా మంది విద్యార్థులు భోజనం చాలక నిరీక్షిస్తుండడంతో అధికారులను ప్రశ్నించారు. మధ్యాహ్నం 200 మందికి మాత్రమే భోజనం సిద్ధం చేశామని, ఆ తరువాత అనుకోకుండా సాయంత్రం వంద వరకు కొత్త అడ్మిషన్లు జరిగాయని చెప్పారు. సాయంత్రం అదనపు విద్యార్థులకు ఎందుకు భోజనం వండలేదని ప్రశ్నించగా అధికారులు నీళ్లు నములుతూ సమాధానం దాటవేశారు. చాలీచాలని అన్నాన్ని అందరికి సరిపెడుతున్నట్లు పిల్లలు వాపోయారు. ఎక్కువ ఉడికిపోయి పిడచకట్టుకుపోయిన అన్నాన్ని చూసి బృందమ్మ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి భోజనాన్ని మీరు తినగలరా? మీ బిడ్డలకు పెడుతారా అని ప్రశ్నించారు. వంటగదిలో కుళ్లిపోయిన కూరగాయలను గుర్తించారు. ప్రతిరోజు తాజాగా కొనుగోలు చేయకుండా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరా తీశారు. చిమ్మచీకట్లో అర్ధ ఆకలితో నాసిరకం భోజనాన్ని పెట్టడంపై ఆమె విస్మయం వ్యక్తం చేశారు. ఇంత అమానుషంగా బిడ్డల కడుపుకొట్టడం తగదని హితవు పలికారు.

బ్యాటరీ తయారీలో సాంకేతికతను పెంపొందించుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐఐటీ, ఐఐఎస్ఈఆర్ అధికారులు

ఏర్పేడు, జూన్ 18: బ్యాటరీ తయారీలో సాంకేతికతను పెంపొందించుకోవాలని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ సూచించారు. ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇండియా ఎనర్జీ స్టోరేజ్ అలయన్స్ సంయుక్తంగా బ్యాటరీ తయారీ విధానంపై వర్క్‌షాప్ నిర్వహించాయి. ముఖ్యఅతిథిగా విజ్ఞాన సాంకేతిక విభాగం నుంచి డాక్టర్ అనిత గుప్తా హాజరై ప్రభుత్వ విధానాలను వివరించారు. నూతనంగా బ్యాటరీ తయారీ విధానంతో పొల్యూషన్ లేకుండా తయారు చేయవచ్చని చెప్పారు. అలాగే సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త బ్యాటరీలను తయారు చేయవచ్చని తెలిపారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ బ్యాటరీ తయారీ పర్యావరణ వ్యవస్థ అభివృద్ధిపై వివిధ పరిశ్రమల భాగస్వాములు ప్రభుత్వ ఏజెన్సీలతో చర్యలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య, న్యూ ఎనర్జీ అమరరాజా ఎనర్జీ బ్యాటరీస్, ఎబిలిటీ లిమిటెడ్ ప్రతినిధులు, ఐఐటీ రూర్కి ప్రొఫెసర్ యోగేష్‌శర్మ, ప్రొఫెసర్ శశిధర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మడిబాకలో విజృంభిస్తున్న డయేరియా



పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ఏర్పేడు, జూన్ 18: ఏర్పేడు మండలం మడిబాక పంచాయతీ లోని అరుంధతివాడ, గిరిజన కాలనీలో డయేరియా వ్యాధి విజృంభిస్తోంది. వారం రోజులుగా వాంతులు, విరోచనాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాపానాయుడుపేట, రేణిగుంట ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న మడిబాక సర్పంచు చెంగల్‌రాజు, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు రాయపనేని మల్లికార్జున నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం పాపానాయుడుపేట వైద్యసిబ్బందితో వైద్య పరీక్షలు చేయించారు. తాగునీరు కలుషితమైందా? లేదా ఫుడ్ పాయిజన్ అయిందో తెలియడం లేదని బాధితులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముక్కంటి ఆలయంలో అక్రమ నియామకాలకు గూడుపుఠాణి

శ్రీకాళహస్తి, జూన్ 18: ముక్కంటి ఆలయంలో వైసీపీ హయాంలో చేసిన అక్రమ నియామకాలను కొనసాగించేందుకు ఇద్దరు అధికారులు గూడుపుఠాణి సాగిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల ఫలితాలు వెలువడటానికి ఒకరోజు ముందుగా 17మందిని అడ్డదారిలో ఒప్పంద ఉద్యోగులుగా నియమించేందుకు వైసీపీతో అంట కాగిన అధికారులు జాబితాను సిద్ధం చేశారు. ఈ విషయంపై సామాజిక మాధ్యమాల్లో దుమారం రేగింది. దీంతో అక్రమ నియామక జాబితాను కొద్దిరోజుల పాటు పక్కన పెట్టారు. మళ్లీ రెండు రోజుల నుంచి తమకు అయిన వారిని దొడ్డిదారిలో నియమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండడం ఆలయంలో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో పనిచేసే ఇద్దరు కీలక అధికారులు తమ హవాను కొనసాగిస్తూ ముడుపులతో నియామకాలు చేసేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

వడదెబ్బతో కూలీ మృతి

కేవీబీపురం, జూన్ 18: మండలంలోని సదాశివపురం పంచాయతీ సరస్వతిపురం గ్రామానికి చెందిన పూడి వెంకటేశ్వర్లు(40) మంగళవారం మధ్యాహ్నం వడదెబ్బతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

క్యూలైన్ల పర్యవేక్షణకు ప్రత్యేక ఏఈవో

టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశం

తిరుమల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భక్తుల రద్దీ అధికంగా ఉండి.. దాదాపు ఐదు కిలోమీటర్లకుపైగా విస్తరించిన క్యూలైన్లను పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా ఒక అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఏఈవో)ను నియమించాలని అధికారులను టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. హెల్త్, అన్నప్రసాదం, శ్రీవారిసేవకు చెందిన అధికారులతో కూడిన ఓ బృందం ఏఈవోతో సమన్వయం చేసుకుంటూ భక్తులకు ఇబ్బంది లేకుండా త్వరగా శ్రీవారి దర్శనం కల్పించడానికి కృషి చేయాలని చెప్పారు. ఈ మేరకు తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిషోర్, వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్షించారు. శ్రీవారి మెట్టు కాలినడక మార్గంలో 1200 మెట్టు వద్ద దివ్యదర్శనం టోకెన్ల స్కానింగ్‌ను తిరిగి ప్రారంభించాలని ఐటీ విభాగాన్ని ఆదేశించారు. పదేపదే గదులు తీసుకుంటున్న దళారీలను గుర్తించి.. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అధికారులకు సూచించారు. నారాయణగిరి షెడ్ల వద్ద వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్ల తరహాలో ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులను పెట్టాలన్నారు. తిరుమల స్థానికులకు కేటాయించిన ఇళ్లు, హోటళ్లు, వాణిజ్య దుకాణాలు, వాటి అద్దెలు, డోనార్ కాటేజీలకు సంబంధించిన భూముల కేటాయింపు, ముడి సరుకుల అనుమతులపై సంబంధిత ఈవోకు అధికారులు వివరించారు.

కొనసాగిన ఈవో తనిఖీలు

మంగళవారం కూడా ఈవో పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. జనతా క్యాంటీన్లు, హోటళ్లను పరిశీలించి యాత్రికులకు వడ్డించే తినుబండారాల ఖరీదు, బయటబోర్డులపై ప్రదర్శించన ధరలను పరిశీలించారు. శిలాతోరణం వద్ద ఉన్న క్యూలైన్లు, నారాయణగిరి అతిథి భవనాలు-3, శేషాద్రినగర్ కాటేజీలను పరిశీలించారు. గదుల్లోని బెడ్లు, మరుగుదొడ్లు, వాటిలో ఉన్నలోపాలను గుర్తించారు.


హోటల్‌లో ఈవో శ్యామలరావు తనిఖీలు

బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 18: జిల్లాలోని వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన 5-18 ఏళ్లలోపు వయసున్న బాలల నుంచి జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ, సాధికారత అధికారి ఎస్.జయలక్ష్మి తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణం, విద్య, ధైర్యసాహసాలు, క్రీడలు, కళలు, సాహిత్యం, సంస్కృతి, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు వంటి అంశాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన బాలలు జూలై 31వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన బాలలకు రాష్ట్రపతి చేతుల మీదుగా 2025 జనవరిలో బహుమతులు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేస్తారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ధర్మారెడ్డి అవినీతిపై విచారణ జరిపించాలి

అలిపిరి వద్ద తెలుగు యువత నిరసన



ధర్మారెడ్డి ఫ్లెక్సీతో తెలుగు యువత

తిరుపతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలంటూ ఉమ్మడి రాష్ట్ర తెలుగుయువత నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అలిపిరివద్ద నిరసన తెలిపారు. టీటీడీని నాశనం చేసేశారని, శ్రీవారిని అడ్డుపెట్టుకుని పైరవీలు నెరపారంటూ ధర్మారెడ్డి ఫ్లెక్సీని చింపి.. కాళ్లతో తొక్కుతూ ఆందోళన చేపట్టారు. తెలంగాణ తెలుగు యువత నాయకుడు క్రాంతితోపాటు తిరుపతి యువత అధ్యక్షుడు కరణం సందీప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువత నాయకులు సంతోష్, గోపి, గణేష్, ఇమ్మాన్యుయేల్, శీను, అనిల్, హరి పాల్గొన్నారు.

సచివాలయంలో జగన్ ఫొటో తొలగింపు


చంద్రబాబు ఫొటో పెడుతున్న టీడీపీ శ్రేణులు

తిరుపతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారం కోల్పోయినా ఇప్పటికీ కొన్ని సచివాలయాల్లో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఫొటోలు ఉండటంతో టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. 24వ డివిజన్‌లోని సచివాలయంలో 'మా నమ్మకం నువ్వే జగన్' అన్న శీర్షికతో ఉన్న ఫ్లెక్సీని మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుల్లెట్ రమణ, వార్డు నాయకులు తొలగించారు. దాని స్థానంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫొటోను ఏర్పాటుచేశారు. ఈక్రమంలో టీడీపీ నాయకులకు, సచివాలయ సిబ్బందితో వాగ్వాదం జరిగింది. ప్రభుత్వం మారిన తర్వాత కూడా మాజీ సీఎం ఫొటోను ఎలా ఉంచుతారని పార్టీ శ్రేణులు నిలదీశాయి. ఫొటోలు తొలగించాలని తమకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేదని సిబ్బంది బదులిచ్చారు. దీనిపై కూటమి నేతలతో పాటు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని బుల్లెట్ రమణ ఈసందర్భంగా మీడియాకు చెప్పారు. కొందరు సచివాలయ సిబ్బందిలో ఇంకా మార్పు కనిపించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.64 కోట్లు

తిరుమల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.64 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 75,872 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 37,236 మంది తలనీలాలు సమర్పించారు.

అలరించిన హరికథాగానం


శివకుమారి హరికథాగానం

తిరుపతి (కల్చరల్), జూన్ 18: పాస్ మనోవికాస్ సేవా సంస్థ, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సప్తగిరి సంగీత సప్తాహం కార్యక్రమంలో భాగంగా మంగళవారం వేమన విజ్ఞాన కేంద్రం భగవంతుడి నామసంకీర్తనతో మార్మోగింది. రోజంతా నిర్విరామంగా జరిగిన హరికథాగానంలో భగవంతుడి సేవావిధానం తెలియజేశారు. ప్రముఖ కథకురాలు మదనపల్లెకి చెందిన శివకుమారి మొదలుకుని, తిరుపతికి చెందిన మండూరి లక్ష్మీకుమారి, పసుపులేటి వరలక్ష్మి, గుండ్లూరు మునిలక్ష్మి, యండమూరి శిఖామణి వంటి పలువురు పేరుపొందిన మహిళాకథకులు భక్తులను పరవశింపచేశారు. కాగా, బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు నిరంతరంగా పురందరదాసాది కన్నడ వాగ్గేయకారుల కీర్తనల గానం ఉంటుందని నిర్వాహకుడు పున్నమరాజు మురళీకృష్ణ తెలిపారు.

సమ్మోహనపరిచిన గానం


మరువాడ భీమశంకర బృందం కచేరి

తిరుపతి (కల్చరల్), జూన్ 18: ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం ఇస్కాన్ ఆలయంలో అమెరికాకు చెందిన మరువాడ భీమశంకర బృందం నిర్వహించిన గాత్ర కచేరి భక్తులను సమ్మోహనపరిచింది. ఎస్వీ సంగీత నృత్య కళాశాలలో గతంలో విద్య నేర్చుకున్న భీమశంకరం ప్రస్తుతం అమెరికాలో ఉన్నప్పటికీ సంగీత ప్రదర్శనలు ఇస్తున్నారు. ఇటీవల హంసధ్వని అనే పుస్తకాన్ని వెలువరించారు. వీరికి వయోలిన్‌పై టి.జగదీశ్వరరావు, మృదంగంపై ఎం.మధుసూదన్ వాద్యసహకారం అందించారు.

టీటీడీ ఈవోకు శుభాకాంక్షలు



శ్యామలరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ - నమస్కరిస్తున్న మహిళా వర్సిటీ వీసీ భారతి

తిరుపతి(కలెక్టరేట్/విశ్వవిద్యాలయాలు), జూన్ 18: టీటీడీ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన శ్యామలరావుకు మంగళవారం పలువురు శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని, పీఆర్వో శ్రీరజని ఉన్నారు.

తిరుమలేశుడి సేవలో త్రివిక్రమ్



తిరుమల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మాటల మాంత్రికుడు, ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం సాయంత్రం కుటుంబ సమేతంగా కాలినడకన తిరుమలకు చేరుకున్న ఆయన మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు.

పద్మావతి అమ్మవారి సేవలో..

తిరుచానూరు: పద్మావతి అమ్మవారిని కూడా మంగళవారం త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు.

తిరుమల ఆలయ పరిసరాల్లో కూల్‌పెయింట్



తిరుమల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భక్తులు ఎండకు ఇబ్బంది పడకుండా తిరుమల శ్రీవారి ఆలయ పరిసర ప్రాంతాల్లో టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశాల మేరకు మంగళవారం కూల్ పెయింట్ వేశారు. గోకులం విశ్రాంతి భవనంలో సోమవారం జరిగిన ఇంజనీరింగ్ విభాగం అధికారుల సమీక్షలో భక్తుల సౌకర్యార్థం వైట్ కూలెంట్ పెయింటింగ్ పనులు వెంటనే చేపట్టాలని ఈవో ఆదేశించారు. దాంతో శ్రీవారి ఆలయం, బేడి ఆంజనేయస్వామి ఆలయం, వాహనమండపం, రాంభగీచ, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే నాలుగు మాడవీధుల్లో వైట్ కూల్ పెయింట్ వేశారు.

గంగమ్మకు నెమలి పింఛాల అలంకరణ



ఆలయం వద్ద భక్తుల రద్దీ


తిరుపతి (కల్చరల్), జూన్ 18: తిరుపతి గంగమ్మను నెమలి పింఛాలతో మంగళవారం సుందరంగా అలంకరించారు. గర్భాలయం మొత్తం అలంకరణ చేయడంతో నెమలికన్నుల సోయగం ఆకట్టుకుంది. జాతర తర్వాత నాల్గవ మంగళవారం కూడా కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. పలువురు పొంగళ్లుపెట్టి, వేయికళ్ల దుత్తలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు భక్తులకు కుంకుమ పంచిపెట్టారు. పలువురు కళాకారులు వివిధ దేవతావేషాల్లో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో మమత, తదితరులు పాల్గొన్నారు.



వివిధ రకాల వేషధారణలో భక్తులు

అన్న క్యాంటీన్ల పునఃప్రారంభానికి చర్యలు


హోటల్ వద్ద పరిశీలిస్తున్న కమిషనర్ అదితి సింగ్

తిరుపతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలకసంస్థ పరిధిలో గతంలో నిర్వహణలో ఉండి మూతపడి ఖరీదైన హోటళ్లు, కేఫ్‌లుగా మారిన అన్న క్యాంటీన్లను మంగళవారం కమిషనర్ అదితి సింగ్ పరిశీలించారు. ప్రభుత్వం మారగానే మూడు క్యాంటీన్లకు నిర్వాహకులే తాళాలేసినట్టు గుర్తించారు. అలాగే స్విమ్స్ సర్కిల్ ఎదురుగా ఉన్న క్యాంటీన్‌ను కూడా త్వరలోనే ఖాళీ చేయించి.. అన్న క్యాంటీన్ల నిర్వహణకు సిద్ధం చేయించాలని కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. అనంతరం డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. కాలువల్లో చెత్తవేసే వారిని గుర్తించి జరిమానా విధించాలన్నారు. తిరుపతి పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. తడి, పొడి చెత్తలను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. ఎస్ఈ మోహన్, ఎంఈ చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, డీఈ మహేష్, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వాన

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 18: జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున మోస్తరు వర్షం కురిసింది. మండలాల వారీగా.. పాకాలలో 44.2, పుత్తూరులో 40.6, వడమాలపేటలో 32.6, వెంకటగిరిలో 30.2, సూళ్లూరుపేటలో 27.6, రేణిగుంటలో 26.4, ఏర్రావారిపాళెంలో 20.2మి.మీ వర్షపాతం నమోదైంది.

మంత్రి కొల్లును కలిసిన టీడీపీ నాయకులు



తిరుపతి (జీవకోన), జూన్ 18: విజయవాడలోని మంత్రి కొల్లు రవీంద్రను ఆయన నివాసంలో మంగళవారం తిరుపతి టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సన్మానించి, శ్రీవారి ప్రసాదాలను అందజేశారు. వీరిలో టీడీపీ నాయకులు బీఎల్ సంజయ్, ఊట్ల సురేంద్రనాయుడు, గుణశేఖర్‌నాయుడు, మణినాయుడు, కందేరి వెంకటేష్‌నాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి, ధనంజయ్ తదితరులున్నారు.

సేంద్రియ పద్ధతుల్లో పంటలు పండించండి


సమావేశంలో ప్రసంగిస్తున్న వెంకటరత్నంనాయుడు

తిరుపతి (ఆటోనగర్), జూన్ 18: సేంద్రియ పద్ధతుల్లో పంటలు పండించాలని రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నంనాయుడు పిలుపునిచ్చారు. రాస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పీఎం కిసాన్ యోజన పథకం 17వ విడత నిధులను వర్చువల్‌గా విడుదల చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. జిల్లాలో 1,89,209 మంది రైతులకు రూ.495.31 కోట్లు పీఎం కిసాన్ యోజన పథకం కింద నగదు బదిలీకి అర్హత పొందారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసులు, పరిశోధన శాఖ సహాయ సంచాలకుడు సి.రమణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరావు, ఆత్మ పీడీ రత్నప్రసాద్, డైరెక్టర్ పద్మావతి, పట్టు పరిశ్రమ అధికారి గీతారాణి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి బ్యాచ్‌లపై కేసులు

మరికొందరికి కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 18: గంజాయి, బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై పోలీసు శాఖ ఉక్కుపాదం మోపుతోంది. రెండ్రోజుల వ్యవధిలోనే దాదాపు 250 మంది గంజాయి, బహిరంగంగా మందు తాగే బ్యాచ్‌లను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. ఈస్ట్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం రిసెప్షన్ కౌంటర్లు, లాకప్ గదులు గంజాయి, బహిరంగంగా మద్యం తాగిన వారితో నిండిపోయాయి. వీరందరికీ పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. మళ్లీ రోడ్లపై మందు తాగుతూ కనిపించినా, గంజాయి విక్రయాలు చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రత్యేక దళాలతో గస్తీ

ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో రాత్రి, పగలు గస్తీ ముమ్మరం చేశారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ప్రతి రోజూ సమస్యాత్మక గ్రామాలను సందర్శించి.. ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడి చట్టాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలను ఇచ్చిన తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

మహిళా వర్సిటీకి రూ.50 లక్షల నిధులు

పరిశోధనా ప్రాజెక్టుల కోసం వెచ్చిస్తామన్న వీసీ


నిధుల మంజూరు పత్రాలతో వీసీ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 18: పద్మావతి మహిళా యూనివర్సిటీకి రూసా నుంచి రెండో దశ కింద రూ.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులను వర్సిటీ పరిధిలో ఎంపిక చేసిన అధ్యాపకులకు పరిశోధనా ప్రాజెక్టుల కోసం వెచ్చించనున్నట్టు వీసీ భారతి వెల్లడించారు. రిజిస్ట్రార్ రజని, అధ్యాపకులు సీతాకుమారి (లా), హిమబిందు (సంగీత లలిత కళల విభాగం), జీఎస్ సరోజిని (ఫిజికల్ ఎడ్యుకేషన్), విజయలక్ష్మి (ఎంబీఏ), రేణుక, అనురాధ, అనిత (ఎడ్యుకేషన్), శారద (ఇంగ్లీష్), తులసి (సోషియల్ వర్క్), పద్మావతి, నీరజ (ఉమెన్ స్టడీస్) పాల్గొన్నారు.

కుప్పం నుంచి తిరుమలకు పాదయాత్ర

చంద్రబాబు సీఎం కాగానే శ్రీవారికి మొక్కు చెల్లించిన యువత


యువతను సన్మానిస్తున్న ఆర్కే నాయుడు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 18: చంద్రబాబు రాష్ట్రానికి మళ్లీ సీఎం అయితే కుప్పం నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తామని అక్కడి యువత మొక్కుకుంది. వారు మొక్కుకున్నట్లు చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడంతో ఈనెల 14వ తేదీన కుప్పం నుంచి తిరుమలకు పాదయాత్ర మొదలుపెట్టారు. మంగళవారం అలిపిరికి చేరుకున్న వీరిని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్కే నాయుడు సత్కరించారు. నాయకులు చిన్నా, బిసన్న, శ్రీరాం, రామాంజి, బషీర్, సురేష్, లక్ష్మన్న, రంగన్న, ఉదయ్ పాల్గొన్నారు.

స్విమ్స్‌కు రూ.10 లక్షల విరాళం


చెక్‌ను ఆర్వీకుమార్‌కు అందజేస్తున్న రాఘవేంద్ర

తిరుపతి(వైద్యం), జూన్ 18: జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌కు చెందిన సరళా ఇంజనీరింగ్ కంపెనీ స్విమ్స్‌కు రూ.10లక్షలను విరాళంగా అందించింది. దీనికి సంబంధించిన చెక్‌ను మంగళవారం డైరెక్టర్ ఆర్వీకుమార్‌కు కంపెనీ ప్రతినిధి రాఘవేంద్ర అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్ డాక్టర్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోవాలి

తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

తిరుమల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోవాలని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తిరుమలలో రాజకీయాలు మాట్లాడం మంచిది కాదన్నారు. తెలుగుజాతి ఔన్నత్యాన్ని, కీర్తిని కాపాడుకోవాలన్నారు. తెలుగు ప్రజల కష్టాలు తీర్చే శక్తిసామర్థ్యాలు ప్రసాదించాలని స్వామిని ప్రార్థించినట్టు చెప్పారు. సకాలంలో వర్షాలు కురిసి.. రైతులు బాగుండాలని కోరుకున్నట్టు తెలిపారు.

టీచర్ల మద్దతు మరువలేను : నాని


కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాని

పాకాల, జూన్ 18: ఎన్నికల్లో తనకు ఉపాధ్యాయులిచ్చిన మద్దతు మరువలేనిదని ఎమ్మెల్యే పులివర్తి నాని కొనియాడారు. ఎప్పుడు ఏ సమస్య తలెత్తినా పులివర్తి కుటుంబం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పాకాల ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను ఆయన పంపిణీ చేశారు.అనంతరం టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

నేడు స్టూడెంట్ కిట్ల పంపిణీ

రామచంద్రాపురం, జూన్ 18: రామచంద్రాపురం మండలం కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాల వద్ద బుధవారం ఉదయం 9గంటలకు ఎమ్మెల్యే పులివర్తి నానీ స్టూడెంట్ కిట్లను పంపిణీ చేస్తారని ఎంఈవో మార్కొండయ్యనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 56 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 1,983మంది విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో కిట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఎంపీడీవో ప్రత్యూష కోరారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



భాకరాపేట, జూన్ 18: భాకరాపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను మంగళవారం ఎమ్మెల్యే పులివర్తి నానీ పంపిణీ చేశారు.డీవైఈవో బాలాజీ, ఎంఈవో సత్యనారాయణ, తహసీల్దారు నాగరాజు, ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, హెచ్ఎం శివకుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, వైస్ ఎంపీపీ సునీత , కార్యదర్శి మదనమోహన, క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, తెలుగు మహిళ అధ్యక్షురాలు చిట్టెమ్మ, ఆర్వీ రమణారెడ్డి, మోహన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, వెంకటరత్నం, కృష్ణమూర్తి, లోకనాథం, చంద్రశేఖర్, మల్లిఖార్జున రెడ్డి, హైదర్‌వలీ, విజయశేఖర్ గౌడ్, కుమారస్వామి, సహదేవరెడ్డి చలపతి, గురుమూర్తి, డిష్ మణి, విజయ్ కుమార్, తులసీ రాయల్, మునస్వామి నాయుడు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఇంటర్ ద్వితీయ సప్లిమెంటరీలో 59శాతం ఉత్తీర్ణత

- ఫస్టియర్, బెటర్‌మెంట్ ఫలితాలు 26న
- ఇకపై రీకౌంటింగ్ ఉండదన్న అధికారులు

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ద్వితీయ సంవత్సరంలో 59శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఆన్‌లైన్ మూల్యాంకనంతో జరిగిన జాప్యం వల్ల కేవలం ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాలను ఇంటర్ విద్యామండలి మంగళవారం విడుదల చేసింది. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వీవీ సుబ్బారావు వివరాలు వెల్లడించారు. జనరల్ కోర్సుల విద్యార్థులు 115319 మంది పరీక్షలు రాయగా 68070(59శాతం) ఉత్తీర్ణులయ్యారని, ఒకేషనల్ విద్యార్థులు 11871 మందికిగాను 6798(57శాతం) ఉత్తీర్ణత సాధించారని వివరించారు. మొత్తంగా 58.86శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. కేటగిరీల వారీగా చూస్తే అబ్బాయిలు 59శాతం, అమ్మాయిలు 58శాతం మంది పాసయ్యారు. ఈ ఏడాది పబ్లిక్ పరీక్షలతో కలిపి చూస్తే జనరల్ విద్యార్థులు 87శాతం మంది, ఒకేషనల్ విద్యార్థులు 84శాతం మంది సెకండియర్‌లో ఉత్తీర్ణులై బయటకు వెళ్లారని తెలిపారు. ఈ ఏడాది సప్లిమెంటరీ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో మూల్యాంకనం చేశామని, అందువల్ల రీకౌంటింగ్ ఉండదని పేర్కొన్నారు. డిజిటల్ విధానంలో కౌంటింగ్ పొరపాట్లు రావన్నారు. రీవెరిఫికేషన్ కావాలంటే ఈనెల 20 నుంచి 25లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఒక్కో పేపరుకు రూ.వెయ్యి ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇకపై రెగ్యులర్ పరీక్షల మూల్యాంకనం కూడా ఆన్‌లైన్‌లోనే చేయనున్నట్లు వివరించారు. సప్లిమెంటరీ ఉత్తీర్ణతలో జిల్లాల వారీగా చూస్తే జనరల్ కేటగిరీలో పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పల్నాడు జిల్లాలు టాప్‌లో ఉన్నాయి. పశ్చిమ గోదావరి, కోనసీమ, కృష్ణా జిల్లాలు చివరన నిలిచాయి. ఒకేషనల్‌లో పార్వతీపురం మన్యం, నెల్లూరు, శ్రీకాకుళం ముందుండగా, కడప, కర్నూలు, విశాఖపట్నం అట్టడుగున ఉన్నాయి. కాగా ఫస్టియర్ సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ ఫలితాలను ఈనెల 26న విడుదల చేస్తామని తెలిపారు.

ఇష్టానుసారం రోడ్లను తవ్వితే సహించేది లేదు

- ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 18: గ్యాస్ పైప్ లైన్ల కోసం పట్టణంలో ఎక్కడపడితే అక్కడ రోడ్లను తవ్వి గుంతలతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం తన నివాసంలో గ్యాస్‌లైన్ ఏజెన్సీ నిర్వాహకులు, మున్సిపల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్యాస్‌పైప్‌లైన్ల కోసం రోడ్లను ధ్వంసం చేయడంతో ప్రజలు అవస్థలు పడ్డారన్నారు. తాగునీటి సరఫరాకు కూడా అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు చేసుకోవాలన్నారు. పనులను మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షించాలని సూచించారు. ఇప్పటివరకూ తవ్వి వదిలేసిన గుంతలపై ప్యాచ్‌వర్కులు పూర్తి చేయాలన్నారు. గుంతల వల్ల ఇబ్బంది కలిగితే అధికారులు లేదా తన దృష్టికి కాని తీసుకురావాలన్నారు. శీలం కిరణ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

8వ వేతన సంఘం ఏర్పాటు చేయాలి



యూనియన్ నాయకులను సత్కరిస్తున్న శంకరరావు

గూడూరు అర్బన్, జూన్ 18: కేంద్ర ప్రభుత్వం 8వ వేతన సంఘం ఏర్పాటు చేయాలని సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి శంకరరావు కోరారు. మంగళవారం స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్ వద్ద సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా సర్వీసులో చేరిన రైల్వే కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. సేఫ్టీ విభాగంలో అందరికీ రిస్క్ అలవెన్సు ఇవ్వాలన్నారు. స్థానిక సమస్యలపై శంకరరావుకు రైల్వే డీఆర్‌యూసీసీ సభ్యుడు మయూరి శ్యామ్‌యాదవ్ వినతిపత్రం అందజేశారు. అనంతరం రక్తదానశిబిరం నిర్వహించారు. శ్రీనివాసరావు, రామగుప్తా, శేఖర్‌బాబు, నాగేశ్వరరావు, రమణరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయానికి బీజేపీ కార్యకర్తల కృషి



మాట్లాడుతున్న బాలకృష్ణమనాయుడు

గూడూరు, జూన్ 18: గూడూరులో కూటమి అభ్యర్థి విజయంలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు చేసిన కృషి అభినందనీయమని పార్టీ పట్టణాధ్యక్షుడు ఆరికట్ల బాలకృష్ణమనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక నరశింగరావుపేటలోని బీజేపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ గెలుపునకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేశారన్నారు. ఇదే స్ఫూర్తితో పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. దయాకర్, జీవి నాయుడు, ప్రభాకర్‌రావు, మహేష్, శ్రీనివాసరావు, వెంకటేష్, సురేష్, హరికృష్ణ, శివ, రమేష్, భవాని, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాశింకు పలువురి అభినందనలు

గూడూరు అర్బన్, జూన్ 18: ఎమ్మెల్యేగా ఎన్నికైన పాశిం సునీల్‌కుమార్‌ను మంగళవారం పలువురు నాయకులు, వివిధ యూనియన్ల నాయకులు ఆయన నివాసంలో సన్మానించారు. జనసేన ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నాయకులు కలసి అభినందనలు తెలిపారు. శివకుమార్, బాలసుబ్రమణ్యం, మనోజ్, భాస్కర్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆర్టీసీడిపో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అభినందనలు తెలిపారు. నారాయణ, సుబ్బారావు, జిలాని పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర వేడుకలు



పెళ్లకూరు, జూన్ 18 : జీలపాటూరులో మంగళవారం వైభవంగా గంగమ్మ జాతర వేడుకలు నిర్వహించారు. ఆలయాన్ని పలు రకాల పూలతో, చలువ పందిళ్లతో తీర్చిదిద్దారు. మహిళలు ఉదయం అంబళ్లను తీసుకొని గ్రామ పుర వీధుల్లో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అధిక ఫీజులపై ఏబీవీపీ నిరసన

సూళ్లూరుపేట, జూన్ 18: అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సన్నీ కోరారు. మంగళవారం స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నాయన్నారు. పుస్తకాల ముసుగులో దోచుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎంఈవో శీనయ్యకు వినతిపత్రం అందజేశారు. ఏబీవీపీ నాయకులు వెంకటేష్, హర్షిత్, చందు, శ్రీమంత్, దేవ, రాకేష్, దినేష్, పవిత్ర పాల్గొన్నారు.

బస్సు ఢీ కొని వృద్ధుడి మృతి



నాయుడుపేట టౌన్, జూన్ 18 : నాయుడుపేట - పండ్లూరు జాతీయ రహదారి సమీపంలో బస్సు ఢీ కొని వృద్ధుడు చెంగయ్య (75) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు పండ్లూరుకు చెందిన చెంగయ్య మంగళవారం ఉదయం రోడ్డు పక్కన బహిర్భూమికి వెళ్తుండగా నెల్లూరు నుంచి నాయుడుపేట వైపు వస్తున్న బస్సు ఢీ కొంది. చెంగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని ట్రాఫిక్ చక్కదిద్దారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డంపింగ్ యార్డ్‌లో అగ్నిప్రమాదం



కాలిపోయిన కొయ్య వ్యర్థాలు

తడ, జూన్ 18 : కారూరుమిట్టలోని డంపింగ్‌యార్డ్‌లో సోమవారం సాయంత్రం మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే అదుపుచేశారు. పరిశ్రమల కొయ్య వ్యర్థాలు కొంతమేర కాలిపోయాయి. పక్కనే ప్లాస్టిక్ వ్యర్థాలకు మంటలు అంటుకోకుండా స్థానికులు చొరవ తీసుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ నెల 10న మాంబట్టు సెజ్‌లోని ఏపీఐఐసీ భూముల్లో పరిశ్రమల వ్యర్థాల డంపింగ్ యార్డ్‌లో మూడు రోజులపాటు మంటలు అదుపులోకి రాని సంగతి తెలిసిందే. ప్లాస్టిక్ వ్యర్థాలే ఇందుకు కారణం. తడలో ఇటువంటి డంపింగ్‌యార్డ్‌లు ఎక్కువగా ఉన్నాయి. భద్రతా ప్రమాణాలు లేకుండా, అనుమతులు లేకుండా వీటిని నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి. నిర్మానుష ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆర్టీసీ సర్వీసుల పునరుద్ధరణకు వినతి



రామ్‌ప్రసాద్‌రెడ్డితో చిట్టమూరు టీడీపీ నాయకులు

చిట్టమూరు, జూన్ 18 : రవాణా శాఖా మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డిని చిట్టమూరు టీడీపీ నాయకులు మంగళవారం కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు, మారంరెడ్డి జనార్దన్‌రెడ్డి, నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, కస్తూరయ్యలు అమరావతి సచివాలయంలో కలసి శాలువా కప్పి సత్కరించారు. చిట్టమూరు నుంచి తిరుపతి, చెన్నై, హైదరాబాద్‌లకు గతంలో ఉన్న ఆర్టీసీ బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కిషోర్‌నాయుడు తెలిపారు.

నేడు మంచినీటి సరఫరాకు అంతరాయం

వెంకటగిరి, జూన్ 18: ఎస్ఎస్ ట్యాంకు నుంచి తాగునీరు అందించే పైప్‌లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలో బుధవారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ మంగళవారం ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని తెలిపారు.

ప్రతిభావంతులకు ఎన్ఆర్ఐ ప్రోత్సాహక బహుమతులు



గూడూరు అర్బన్, జూన్ 18: అయ్యవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ వైష్ణవి నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని సాధించుకునేందుకు కష్టపడాన్నారు. పాఠశాలలో 505 మార్కులు సాధించిన ప్రవీణకు రూ.10 వేలు, 475 మార్కులు సాధించిన చెంచురత్నానికి రూ. 5 వేలు, 473 మార్కులు సాధించిన సంధ్యకు రూ. 2,500 నగదు వంతున ప్రోత్సాహాన్ని అందించారు. మంజులమ్మ, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, హెచ్ఎం ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

అలపలేరు డ్యాంపై చిగురించిన ఆశలు

- ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ
- తగ్గిపోయిన నీటి సామర్థ్యం
- మరమ్మతులు చేస్తే మంచి రోజులు



డ్యాం లోపల పిచ్చి మొక్కలు (ఫైల్ ఫోటో)

డక్కిలి, జూన్ 18 : సుమారు రెండు వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించే పాతనాలపాడు సమీపంలోని అలపలేరు డ్యాం దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్త ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకుంటుందని వీరంతా ఆశిస్తున్నారు. 50 ఏళ్ల క్రితం వెలికంటి ఏరుకు అడ్డంగా అలపలేరు డ్యాం నిర్మించారు. వర్షాధారంతో నిండే ఈ డ్యాం పాతనాలపాడు, బ్రాహ్మణపల్లి, చాకలపల్లి, బీమవం, దగ్గవోలు, మోపూరు గ్రామాల్లోని సుమారు 2వేల ఎకరాలకు సాగు నీరందించేది. వైసీపీ హయాంలో డ్యాంకు ఎలాంటి మరమ్మతులూ చేపటలేదు. దీంతో కట్టలు బాగా బలహీన పడ్డాయి. డ్యాం లోపల భాగమంతా పిచ్చి మొక్కలతో నిండి పోయింది. గతంలో చోరీ అయిన షట్టర్ల స్థానంలో ఇప్పటికీ కొత్తవి ఏర్పాటు చేయలేదు. దీనివల్ల నీటి సామర్థ్యం బాగా తగ్గిపోయింది. ప్రస్తుతం 500 ఎకరాలకు మించి సాగునీరందడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షాలు కురిస్తే కట్టలకు ప్రమాదం ఉందని వీరు చెబుతున్నారు. డ్యాం కలుజు కూడా దెబ్బతింది. కలుజు షటర్లు లేకపోవడంతో వెలికంటి ఏటి ద్వారా డ్యాం లోకి చేరే వర్షపు నీరు వృధాగా సముద్రం పాలవుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పాలకులు డ్యాంపై పైసా వెచ్చించక ఈ పరిస్థితి దాపురించిందంటున్నారు. డ్యాం ద్వారా సాగునీరు అందించే ప్రధాన కాలువలు కూడా పూడిపోయాయి. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చొరవ తీసుకుని డ్యాంకు మరమ్మతులు చేయించి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

పులికాట్ స్థితిగతులపై జూలై 19న ప్రజాభిప్రాయ సేకరణ



సమావేశ ఉత్తర్వులను అందజేస్తున్న కిషోర్

తడ, జూన్ 18 : పులికాట్ తీరప్రాంత నిర్వహణ, అభివృద్ధిపై ప్రజాభిప్రాయ సేకరణకు జూలై 19న నేలపట్టులో సభను ఏర్పాటు చేస్తామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనలిస్టు కిషోర్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన ఎంపీపీ కొలవి రఘురెడ్డి, ఎంపీడీవో మురళీకృష్ణలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సభకు తీర ప్రాంత ప్రజలు హాజరయ్యేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పులికాట్ సరస్సు తీరప్రాంత ప్రస్తుత పరిస్థితులపై నివేదిక తయారుచేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డును కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ ఆదేశించిందన్నారు. తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, చిట్టమూరు, వాకాడు, కోట, చిల్లకూరు మండలాల తీరప్రాంత ప్రజల నుంచి వివరాలు సేకరించేందుకు సభను నిర్వహించనున్నామన్నారు. అభ్యంతరాలు సూచనలను ప్రజలు ప్రస్తావించవచ్చన్నారు. ఆమేరకు ప్రజలకు అవగాహన కల్పించేలా పంచాయతీ కార్యదర్శులు చొరవ తీసుకోవాలన్నారు. మండల ఉపాధ్యక్షుడు వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు గాబ్రియల్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే కూటమి అజెండా : నెలవల



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నెలవల

సూళ్లూరుపేట, జూన్ 18: వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధిని మరిచి ప్రతిపక్షాలపై కక్ష సాధింపులకు దిగిందని మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం విమర్శించారు. తాము ఆ ధోరణికి స్వస్తి పలికి అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. మంగళవారం టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్ నివాసంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2016లోనే టీడీపీ హయాంలో సూళ్లూరుపేట దాహార్తిని తీర్చేందుకు మంగళంపాడు చెరువులో సమ్మర్ స్టోరేజ్ నిర్మించి తాగునీరందించేందుకు రూ.162 కోట్లు మంజూరయ్యాయన్నారు. నాయుడుపేటలో కూడా రూ.149 కోట్లతో సమ్మర్ స్టోరేజ్‌కు శ్రీకారం చుట్టారన్నారు. వైసీపీ ఐదేళ్లు వీటి గురించి పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వ పాలనలో సమ్మర్ స్టోరేజ్ పూర్తిచేసి తాగునీరందించేందుకు చొరవ తీసుకుంటామన్నారు. పూర్తయిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి, బొమ్మన్ శ్రీధర్, నీలకంఠం, విజయనాయుడు, జీవా పాల్గొన్నారు.

హంస వాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు



గూడూరు, జూన్ 18: స్థానిక రాజావీధిలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం విష్వక్సేనారాధనమ్, పుణ్యాహవచనమ్, నిత్యహోమం పూజలు జరిపారు. అనంతరం తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. రాత్రికి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన హంసవాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

త్వరితగతిన ఫ్లైఓవర్ పనులు పూర్తి చేయాలి



ఆర్అండ్‌బీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న వరప్రసాదరావు

గూడూరు, జూన్ 18: గూడూరులో ఫ్లైఓవర్ నిర్మాణ పనులను త్వరిగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే వరప్రసాదరావు కోరారు. మంగళవారం విజయవాడలో ఆయన ఆర్అండ్‌బీ చీఫ్ మేనేజర్ మాధవీసుకన్యను కలసి ఈమేరకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 13 ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్ పనులు తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామన్నారు. నియోజకవర్గపరిధిలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, రాష్ట్రప్రభుత్వ సహకారంతో కేంద్రం నిధులు తీసుకువచ్చి పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. శ్రీనివాసులు, వినీష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 18: జిల్లాలోని వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన 5-18 ఏళ్ల లోపు వయసున్న బాలల నుంచి జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ, సాధికారత అధికారి ఎస్.జయలక్ష్మి తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణం, విద్య, ధైర్యసాహసాలు, క్రీడలు, కళలు, సాహిత్యం, సంస్కృతి, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు వంటి అంశాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన బాలలు జూలై 31వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన బాలలకు రాష్ట్రపతి చేతుల మీదుగా 2025 జనవరిలో బహుమతులు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేస్తారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మలేరియాపై అవగాహన



అవగాహన ర్యాలీలో డాక్టర్ రాజేష్

వెంకటగిరిటౌన్, జూన్ 18: వర్షకాలంలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వెంకటగిరి అర్బన్ సీహెచ్‌సీ డాక్టర్ రాజేష్ సూచించారు. మంగళవారం స్థానిక పాతకోట పరిధిలోని పలు ప్రాంతాల్లో మలేరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు గుడ్లు పెట్టకుండా నీటి గుంటలు పూడ్చలని కోరారు. దోమతెరలు వాడుకోవాలన్నారు. తాగి పడేసిన కొబ్బరి బొండాలు, పగిలిపోయన కుండ పెంకులు, కుండీలు, టీ కప్పులు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.



విజయశ్రీ దంపతులకు సత్కారం

నాయుడుపేట, జూన్ 18 : టీడీపీ ఆవిర్భావం నుంచి కీలకపాత్ర పోషిస్తున్న దివంగత సీనియర్ నాయకుడు గూడూరు రఘునాథరెడ్డి చిరస్మరణీయుడని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేటలోని రఘునాథరెడ్డి ఇంటిలో మాజీ సర్పంచ్ గూడూరు ప్రభావతమ్మను కలిశారు. కూటమి విజయంపై గృహంలో ఎమ్మెల్యే విజయశ్రీ-పార్థసారథి దంపతులు శుభాకాంక్షలు తెలియజేశారు. రఘునాథరెడ్డి సేవలను గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ-పార్థసారథి దంపతులను ప్రభావతమ్మ సత్కరించారు. తెలుగుయువత పార్లమెంట్ ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, గూడూరు సుధీర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, పోలయ్యయాదవ్, సందీప్, గోపాల్, షేక్ కాలేషా, జాకీర్ తదితరులు ఉన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న క్రీడాకారులు

ఆటస్థలం కబ్జాపై ఫిర్యాదు

కోట, జూన్ 18 : కేశవరంలోని క్రీడా ప్రాంగణాన్ని కొంతమంది కబ్జా చేస్తున్నారని అక్కడి క్రీడాకారులు మంగళవారం తహసీల్దారు నాగరాజరావుకు ఫిర్యాదు చేశారు. పాతికేళ్లుగా మద్దాలికి వెళ్లే రోడ్డులో ప్రభుత్వ భూమిని చిట్టేడు, కేశవరం, మద్దాలి పంచాయతీలకు చెందిన తాము క్రీడా ప్రాంగణంగా ఉపయోగించుకుంటున్నామన్నారు. సర్వే నెంబరు 193లోని ఈ ప్రభుత్వ భూమిని స్థానికంగా కొంతమంది ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అడిగితే దౌర్జన్యానికి దిగుతుతున్నారన్నారు. తక్షణం స్పందించి కబ్జాదారుల నుంచి కాపాడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై తక్షణ చర్యలు చేపడతామని తహసీల్దారు నాగరాజరావు హామీ ఇచ్చారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.64 కోట్లు

తిరుమల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.64 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 75,872 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 37,236 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమలేశుడి సేవలో త్రివిక్రమ్



తిరుమల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మాటల మాంత్రికుడు, ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం సాయంత్రం కుటుంబ సమేతంగా కాలినడకన తిరుమలకు చేరుకున్న ఆయన మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. పద్మావతి అమ్మవారిని కూడా మంగళవారం త్రివిక్రమ్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు.

రేపటి నుంచి 54వ గంధోత్సవాలు



నెలబల్లిలోని హుస్సేనమ్మ దర్గా

దొరవారిసత్రం, జూన్ 17: పుత్ర సంతాన ప్రాప్తినిచ్చే దైవంగా హుస్సేనమ్మ దర్గా ప్రాచుర్యం పొందుతోంది. దొరవారిసత్రం మండలం నెలబల్లిలో జాతీయ రహదారి పక్క న హుస్సేనమ్మ దర్గాను దర్శించు కంటే తమ కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. రాష్ట్రం నుంచే కాకుండా తమిళనాడు నుంచి భక్తులు విచ్చేసి హుస్సేనమ్మను దర్శించుకుంటారు. దర్గా ఉన్న నెల బల్లిలో ఒక్క ముస్లిం కుటుంబం కూడా లేక పోయినప్పటికీ ఏటా క్రమం తప్పకుండా గంధోత్సవాలను నిర్వహించడం ప్రత్యేకత. ఈనెల 20 నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు కమిటీ పేర్కొంది.

ఇదీ దర్గా విశిష్టత

వంద సంవత్సరాల క్రితం నెలబల్లిలో ముస్లిం కుటుంబానికి చెందిన హుస్సేనమ్మ చనిపోతే రహదారి పక్కన పూడ్చినట్లు చెబుతారు. అక్కడే ఒక రావి చెట్టు పెరిగింది. నెమిలిమిట్ట అగ్రహారానికి చెందిన హంసయ్య అనే వ్యక్తి నెలబల్లి గ్రామ దారిన నడిచి వెళ్తూ మధ్యాహ్నం కావడంతో రావిచెట్టు కింద నిద్రించాడు. ఆయనకు కలవచ్చింది. అందులో ఓ మహిళ తాను హుస్సేనమ్మ అని, దర్గా ఏర్పాటు చేసి పూజలు చేయాలని కోరింది. ఈక్రమంలో హంసయ్య దర్గా ఏర్పాటు చేసి పూజలు చేయడం ప్రారంభించారు. అలా హం సయ్య కుటుంబీకుల నుంచి దర్గా బా గోగులు చూసుకోవడం నెలబల్లి గ్రా మస్థులు ప్రారంభించారు. అదే గ్రామానికి చెందిన మాధవరెడ్డి దర్గా అభివృద్ధికి కమిటీ ఏర్పాటు చేశారు. 54వ గంధ మహోత్సవాలను ఈ ఏడాది నిర్వహిస్తున్నారు. దర్గాలో నిష్ఠగా 9 వారాల పాటు ప్రార్థనలు చేస్తే పుత్రసంతానం కలుగుతుందని నమ్మకం. అలా పుట్టిన తమ పిల్లలకు హుస్సేనయ్య, హుస్సేనమ్మ అని పేర్లు పెట్టుకుంటుంటారు.

గంగమ్మకు ముక్కంటి సారె సమర్పణ



సారె తీసుకెళుతున్న ఈవో నాగేశ్వరరావు, టీడీపీ నేత సత్రవాడ ప్రవీణ్

శ్రీకాళహస్తి, జూన్ 18: శ్రీకాళహస్తి పట్టణం పొనగల్‌లో వెలసిన గంగమ్మకు శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున మంగళవారం ముక్కంటి సారెను సమర్పించారు. పొనగల్‌లోని పొన్నాలమ్మ ఆలయం వద్ద సారెకు పూజలు నిర్వహించి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సారెను శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, టీడీపీ నాయకుడు సత్రవాడ ప్రవీణ్ ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆలయం వద్ద జాతర కమిటీ సభ్యులు వారికి స్వాగతం పలికి సారెను స్వీకరించారు. పూజలు నిర్వహించి వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు, ఆలయ అధికారులు మల్లికార్జునప్రసాద్, కృష్ణారెడ్డి, హరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు



అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న పురపాలక సిబ్బంది

శ్రీకాళహస్తి, జూన్ 18: శ్రీకాళహస్తి పట్టణంలో అక్రమ నిర్మాణాల తొలగింపునకు పురపాలకసంఘ అధికారులు సన్నద్ధమయ్యారు. పట్టణంలో పలువురు అనుమతులు లేకుండా, పరిమితికి మించి బహుళ అంతస్థుల భవనాలు నిర్మించారు. గత వైసీపీ పాలనలో రాజకీయ అండతో యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించారు. దీనిపై ఈ యేడాది ఫిబ్రవరి 26వ తేదీన నిర్మాణ నిబంధనలకు పాతర అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఈ అంశంపై ప్రస్తుతం పురపాలక సంఘ అధికారులు సీరియస్‌గా దృష్టి పెట్టారు. ముక్కంటి ఆలయ సమీపంలోని బజారువీధిలో ఓ వైసీపీ నేత నాలుగు శ్లాబులతో భవనం నిర్మించేందుకు అనుమతి పొంది ఏడు శ్లాబులతో భవనం నిర్మించాడు. అదనంగా నిర్మించిన మూడు స్లాబులను పురపాలక సంఘ అధికారులు మంగళవారం తొలగించే పనులను ప్రారంభించారు. ఇదే తరహాలో మరికొందరు వైసీపీ నేతలు కనీస అనుమతులు లేకుండా భారీ భవనాలు, భారీ కల్యాణ మండపాలు కూడా నిర్మించి ఉన్నారు. దీనిపై కూడా అధికారులు దృష్టి సారించనున్నట్లు తెలిసింది.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

వరదయ్యపాళెం, జూన్ 18: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని గోవర్థనపురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కులశేఖర్, లోకేష్ అన్నారు. మండలంలోని సీఎల్ఎన్‌పల్లె, ఎస్సీ కాలనీ, చావాలి, మిట్టకాలనీ, తూర్పు ఎస్టీకాలనీల్లో ఇంటింటికీ మంగళవారం సందర్శించారు. విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం వల కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం పలువురు బడి మానేసిన విద్యార్థులను బడిలో చేరేలా ఒప్పించారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, జూన్ 18: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, జూన్ 18: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పదహారు కాళ్ల మండపంలో వెలసిన ఆంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. సింధూరం దిద్ది పుష్పాలతో అలంకరించారు. భక్తులు తమలపాకుల మాలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఉపాధి కూలీకి అస్వస్థత

పిచ్చాటూరు, జూన్ 18: పిచ్చాటూరు మండలం నీరువాయి గ్రామానికి చెందిన జ్యోతి ఉపాధి పనులు చేస్తుండగా అస్వస్థతకు గురైంది. మంగళవారం ఉదయం 7 గంటలకు పని చేస్తున్న ప్రదేశంలోనే జ్యోతి అస్వస్థతకు గురై పడిపోయింది. విషయం తెలుసుకున్న బంధువులు హుటాహుటిన ఆస్పత్రిలో చేర్పించారు. ఎక్కువ బరువు మోసినందుకు అస్వస్థతకు గురైందని వైద్యులు తెలిపారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ముక్కంటి ఆలయంలో అక్రమ నియామకాలకు గూడుపుఠాణి

శ్రీకాళహస్తి, జూన్ 18: ముక్కంటి ఆలయంలో వైసీపీ హయాంలో చేసిన అక్రమ నియామకాలను కొనసాగించేందుకు ఇద్దరు అధికారులు గూడుపుఠాని సాగిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల ఫలితాలు వెలువడటానికి ఒకరోజు ముందుగా 17మందిని అడ్డదారిలో ఒప్పంద ఉద్యోగులుగా నియమించేందుకు వైసీపీతో అంటకాగిన అధికారులు జాబితాను సిద్ధం చేశారు. ఈ విషయంపై సామాజిక మాధ్యమాల్లో దుమారం రేగింది. దీంతో అక్రమ నియామక జాబితాను కొద్దిరోజుల పాటు పక్కన పెట్టారు. మళ్లీ రెండు రోజుల నుంచి తమకు అయిన వారిని దొడ్డిదారిలో నియమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండడం ఆలయంలో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఎస్టాబ్లిస్‌మెంట్ విభాగంలో పనిచేసే ఇద్దరు కీలక అధికారులు తమ హవాను కొనసాగిస్తూ ముడుపులతో నియామకాలు చేసేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

పంచాయతీ దుకాణాల సీజ్

రేణిగుంట, జూన్ 16: రేణిగుంట బస్టాండు వద్ద ఉన్న 9 దుకాణాలను పంచాయతీ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. బస్టాండు వద్ద ఉన్న ఖాళీ స్థలాన్ని నేల బాడుగ పేరుతో లీసుకు తీసుకుని గదులు నిర్మించారు. వాటిని ఇతరులకు అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నారు. పైగా లీజు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా బకాయిలు ఉన్నారు. ఈ నేపథ్యంలో గత శుక్రవారం జరిగిన పంచాయతీ సమావేశంలో దుకాణాలు తమకే ఇవ్వాలంటూ వార్డు మెంబర్లు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురించడంతో అధికారులు స్పందించారు. ఈవోపీఆర్డీ రత్నప్రభ పంచాయతీ కార్యదర్శి రవిశంకర్ రెడ్డితో కలిసి దుకాణాలను సీజ్ చేశారు. పంచాయతీకి రావాల్సిన రూ.340లక్షల బకాయిలు చెల్లించి త్వరలో నిర్వహించే వేలంపాటలో పాల్గొనవచ్చని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

మొక్కు చెల్లింపు

శ్రీకాళహస్తి, జూన్ 18: శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్‌రెడ్డి అఖండ విజయం సాధించడంతో టీడీపీ రాష్ట్ర గాండ్ల తెలికుల బీసీ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు కన్నావరం హరిబాబు కాశీలోని విశ్వనాథునికి మంగళవారం తలనీలాలు సమర్పించారు. గతేడాది గంగానది పుష్కర స్నానానికి వెళ్లిన సందర్భంగా బొజ్జల సుధీర్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించాలని మొక్కుకున్నానని, అందుకు అనుగుణంగా గంగమ్మకు సారె సమర్పించి కాశీ విశ్వనాథునికి తలనీలాలు సమర్పించి అర్చలు చేసినట్లు హరిబాబు తెలిపారు.

అనుగ్రహం కోసం ప్రదక్షిణలు

సత్యవేడు, జూన్ 18: రాష్ట్రంలో మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుందన్న ధీమాతో ఆ పార్టీకి సహాయ సహకారాలు అందించారు. తీరా ఫలితాలు వెలువడ్డాక అంచనాలు తలకిందులయి, బొక్క బోర్లా పడ్డారు. పుట్టి మునిగిందని తెలిశాక, ప్రస్తుతం అధికార పార్టీ నేతల అనుగ్రహం కోసం వెంపర్లాడుతున్నారు. మండలంలోని మల్లవారి ఫీల్డ్ అసిస్టెంట్ సన్యాసయ్య వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేష్‌ను గెలిపించుకునేందుకు నిబంధనలను సైతం తుంగలో తొక్కి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈసీ ఆగ్రహానికి గురయి సస్పెండ్ అయ్యారు. పార్టీ ఓటమి పాలయ్యాక తత్వం బోధపడింది కాబోలు. ప్రస్తుతం ఆయన ఎమ్మెల్యే ఆదిమూలం కార్యక్రమాల్లో పాల్గొనడం చర్చనీయాంశంగా మారుతోంది. ఎమ్మెల్యే మంగళవారం మాదనపాళెంలో పాల్గొన్న ఒక కార్యక్రమానికి అందరికన్న ముందు ఆయన హాజరు కావడం విశేషం. ఇలాంటి అధికార పార్టీ శిబిరంలో ఎక్కువయ్యారని గుసగుసలు వినబడుతున్నాయి.

వడదెబ్బతో కూలీ మృతి

కేవీబీపురం, జూన్ 18: మండలంలోని సదాశివపురం పంచాయతీ సరస్వతిపురం గ్రామానికి చెందిన పూడి వెంకటేశ్వర్లు(40) మంగళవారం మధ్యాహ్నం వడదెబ్బతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

విద్యాసామగ్రి పంపిణీ

శ్రీకాళహస్తి, జూన్ 18: శ్రీకాళహస్తి మండలం ముళ్లపూడి గిరిజన కాలనీలో సుమారు 20మంది విద్యార్థులకు ప్రముఖ సంఘ సేవకుడు యల్లంపాటి కోటేశ్వరబాబు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

జోరందుకున్న ఉపాధి పనులు

కేవీబీపురం, జూన్ 18: మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు భూమి నానడంతో ఉపాధి పనులు జోరందుకున్నాయి. ట్రెంచింగ్, పొలాల్లో పొంట బోదులు పనులు చురుగ్గా సాగుతున్నాయి.

మీ బిడ్డలకైతే ఇలాంటి అన్నం పెడతారా?

- కుళ్లిపోయిన కూరగాయలు
- పిడచ కట్టిన అన్నం, నీళ్లను తలపించే రసం
- 80మంది పిల్లలకు అన్నమే లేక ఆకలి కేకలు
- గురుకుల వసతిగృహంలో దారుణ పరిస్థితులు
- విద్యార్థుల పరిస్థితి చూసి చలించిపోయిన బృందమ్మ



ముద్ద కట్టిన అన్నాన్ని పరిశీలిస్తున్న బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి, జూన్ 18: శ్రీకాళహస్తి పట్టణం తెలుగుగంగకాలనీలోని గురుకుల పాఠశాల వసతిగృహంలో దారుణ పరిస్థితులు వెలుగులోకి వచ్చాయి. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ మంగళవారం రాత్రి వసతి గృహాన్ని తనిఖీ చేశారు. కుళ్లిపోయిన కూరగాయలు పిడచ కట్టిన అన్నం, సాంబారు లేకుండా నీళ్లను తలపించే రసంతో భోజనం, వీటన్నింటికి తోడు 80మంది పిల్లలకు అసలు అన్నమే లేకపోవడం.. గాఢ అంధకారంలో బాలికల అవస్థలను ఆమె గుర్తించి అధికారులను నిలదీశారు. 2014 వరకు శ్రీకాళహస్తి పట్టణంలో వసతిగృహాల నిర్వహణ అత్యంత దయనీయంగా కొనసాగింది. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ వసతి గృహాలను తనిఖీ చేసి సమస్యలను గుర్తించారు. ఎంతో శ్రమించి వసతిగృహాల నిర్వహణను గాడిలో పెట్టారు. ఆ తరువాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు వసతిగృహాల నిర్వహణపై కనీసం దృష్టి సారించలేదు. మళ్లీ పిల్లలకు మెరుగైన సేవలు అందించాలన్న ఆశయంతో రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కాసాగార్డెన్, ఇంటిగ్రేటెడ్ వసతి గృహాలను తనిఖీ చేశారు. అక్కడి పరిస్థితులను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఎమ్మెల్యే తల్లి బృందమ్మ మంగళవారం తెలుగుగంగ కాలనీలోని గురుకుల పాఠశాల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఇక్కడ చీకట్లో బాలికలు అవస్థలు పడుతూ భోజనం చేస్తున్న దృశ్యాలను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. జనరేటర్ ఉన్నా ఎందుకు మరమ్మతులు చేయలేదని నిలదీశారు. చాలా మంది విద్యార్థులు భోజనం చాలక నిరీక్షిస్తుండడంతో అధికారులను ప్రశ్నించారు. మధ్యాహ్నం 200 మందికి మాత్రమే భోజనం సిద్ధం చేశామని, ఆ తరువాత అనుకోకుండా సాయంత్రం వంద వరకు కొత్త అడ్మిషన్లు జరిగాయని చెప్పారు. సాయంత్రం అదనపు విద్యార్థులకు ఎందుకు భోజనం వండలేదని ప్రశ్నించగా అధికారులు నీళ్లు నములుతూ సమాధానం దాటవేశారు. చాలీచాలని అన్నాన్ని అందరికి సరిపెడుతున్నట్లు పిల్లలు వాపోయారు. ఎక్కువ ఉడికిపోయి పిడచకట్టుకుపోయిన అన్నాన్ని చూసి బృందమ్మ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి భోజనాన్ని మీరు తినగలరా? మీ బిడ్డలకు పెడుతారా అని ప్రశ్నించారు. వంట గదిలో కుళ్లిపోయిన కూరగాయలను గుర్తించారు. ప్రతిరోజు తాజాగా కొనుగోలు చేయకుండా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరా తీశారు. చిమ్మచీకట్లో అర్థ ఆకలితో నాసిరకం భోజనాన్ని పెట్టడంపై ఆమె విస్మయం వ్యక్తం చేశారు. ఇంత అమానుషంగా బిడ్డల కడుపుకొట్టడం తగదని హితవు పలికారు.

బ్యాటరీ తయారీలో సాంకేతికతను పెంపొందించుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐఐటీ, ఐఐఎస్ఈఆర్ అధికారులు

ఏర్పేడు, జూన్ 18: బ్యాటరీ తయారీలో సాంకేతికతను పెంపొందించుకోవాలని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ సూచించారు. ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సూన్స్ అండ్ టెక్నాలజీ, ఇండియా ఎనర్జీ స్టోరేజ్ అలయన్స్ సంయుక్తంగా బ్యాటరీ తయారీ విధానంపై వర్క్‌షాప్ నిర్వహించాయి. ముఖ్యఅతిథిగా విజ్ఞాన సాంకేతిక విభాగం నుంచి డాక్టర్ అనిత గుప్తా హాజరై ప్రభుత్వ విధానాలను వివరించారు. నూతనంగా బ్యాటరీ తయారీ విధానంతో పొల్యూషన్ లేకుండా తయారు చేయవచ్చని చెప్పారు. అలాగే సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త బ్యాటరీలను తయారు చేయవచ్చని తెలిపారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ బ్యాటరీ తయారీ పర్యావరణ వ్యవస్థ అభివృద్ధిపై వివిధ పరిశ్రమల భాగస్వాములు ప్రభుత్వ ఏజెన్సీలతో చర్చలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య, న్యూ ఎనర్జీ అమరరాజా ఎనర్జీ బ్యాటరీస్, ఎబిలిటీ లిమిటెడ్ ప్రతినిధులు, ఐఐటీ రూర్కి ప్రొఫెసర్ యోగేష్‌శర్మ, ప్రొఫెసర్ శశిధర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మడిబాకలో విజృంభిస్తున్న డయేరియా



పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ఏర్పేడు, జూన్ 18: ఏర్పేడు మండలం మడిబాక పంచాయతీలోని అరుంధతివాడ, గిరిజన కాలనీలో డయేరియా వ్యాధి విజృంభిస్తోంది. వారం రోజులుగా వాంతులు, విరోచనాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాపానాయుడుపేట, రేణిగుంట ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న మడిబాక సర్పంచు చెంగల్‌రాజు, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు రాయపనేని మల్లికార్జున నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం పాపానాయుడుపేట వైద్యసిబ్బందితో వైద్య పరీక్షలు చేయించారు. తాగునీరు కలుషితమైందా? లేదా ఫుడ్ పాయిజన్ అయిందో తెలియడం లేదని బాధితులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సికిల్ సెల్ అనీమియాపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 18: మండలంలోని కాటూరు గిరిజన కాలనీవాసులకు సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో వెంకటేశ్వర్లు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా వల్ల రక్త ప్రసరణ తగ్గుతుందని, దీంతో స్ట్రోక్, కంటి సమస్యలు వస్తాయన్నారు.

వీఆర్వోలు బాధ్యతగా పనిచేయాలి

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 18: వీఆర్వోలు బాధ్యతాయుతంగా పని చేయాలని డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. ఎవైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజా సమస్యలపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సవితకు ముక్కంటి ప్రసాదాలు

కేవీబీపురం, జూన్ 18: రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితను మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర బీసీసెల్ అధ్యక్షుడు మునస్వామి యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శ్రీకాళహస్తీశ్వరస్వామి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సర్పంచులు దొరబాబు నాయుడు, సురేష్, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ముక్కంటి ఆలయం



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, జూన్ 17: శ్రీకాళహస్తీశ్వరాలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 26వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,550మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 2,700మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,725మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,185, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 308మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 270మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 73మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 18,427 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

వేడుకగా కాలభైరవస్వామి ప్రాకారోత్సవం

శ్రీకాళహస్తి, జూన్ 18: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు ముందుగా కాలభైరవ స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు మేళ తాళాల మధ్య అభిషేకాలు ధూప, దీప, నైవేద్య, హారతులు సమర్పించారు. కాలభైరవ స్వామి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం నుంచి విజయ స్థూపం వరకు వెళ్లి అక్కడి నుంచి ప్రదక్షిణగా చేసి తిరిగి ఆలయంలో కొలువుతీర్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు



అంబళ్లు పెట్టి పూజలు చేస్తున్న గ్రామస్తులు

చింతకాల్వలో చాంతాళ్ల గంగమ్మ జాతర



గెరిగె ఊరేగింపు

వడమాలపేట, జూన్ 18: మండలంలోని చింతకాల్వ గ్రామంలో 30 ఏళ్ల అనంతరం చాంతాళ్ల గంగమ్మ జాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. గడివీధి గంగమ్మ వద్దకు ప్రత్యేక వాయిద్యాలతో భక్తులు అంబళ్లు తెచ్చారు. పూజలు చేశారు. అనంతరం భక్తులకు అంబళ్లు పంపిణీ చేశారు. గ్రామంలో గెరిగ ప్రదర్శన జరిగింది. సాయంత్రం గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం తెల్లవారు జామున ఉమ్మవారు ఊరేగింపుగా నడివీధిలోనికి చేరుకొంటారని జాతర కమిటీ సభ్యులు తెలిపారు. కాగా, 30 ఏళ్ల క్రితం గ్రామంలో జాతర ఆగిపోయింది. మళ్లీ గ్రామంలో జాతర నిర్వహించేందుకు యువకులు పూనుకున్నారు. ఇందుకు గ్రామస్తులూ సహకరించారు. ఆలయం కూడా నిర్మించి జాతరను పునఃప్రారంభించారు.

చిన్నశేష, హంస వాహనాలపై వెంకటేశ్వరుడి విహారం



చిన్న శేష, హంస వాహనాలపై ప్రసన్న వెంకటేశ్వరుడు

వడమాలపేట, జూన్ 18: అప్పలాయగుంట శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు మంగళవారం ఉదయం ప్రసన్న వెంకటేశ్వరుడు చిన్న శేష వాహనం, రాత్రి హంస వాహనాలపై మాడవీధుల్లో విహరించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఉదయం ప్రసన్న వెంకటేశ్వరుడు సర్వాలంకారం భూషితుడై ఐదు తలలు ఉన్న శేష వాహనంపై మోహన కృష్ణుని అలంకారంలో మేళతాలాలు మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అలసి సొలసిన శ్రీవారికి స్నపన తిరుమంజనం గావించారు. సాయంత్రం భక్తుల గోవిందనామ స్మరణలతో శ్రీవారికి ఊంజలసేవ నిర్వహించారు. రాత్రి స్వామివారు హంస వాహనారూడుడై సరస్వతీదేవి అలంకారంలో భక్తుల గోవిందనామ స్మరణల నడుమ మాడవీధుల్లో ఊరేగారు. భక్తులు నారీకేలా, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఏఈవో ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, ప్రధాన అర్చకులు సూర్యకుమారాచర్యులు పాల్గొన్నారు.



అలరిస్తున్న కోలాటాల ప్రదర్శన

వడమాలపేట, జూన్ 18: అప్పలాయగుంట శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వాహన సేవల్లో మహిళల కోలాటాల ప్రదర్శన భక్తులను అలరిస్తోంది. ప్రతిరోజు ఉదయం, రాత్రి వాహనసేవల్లో శ్రీవారిని కీర్తిస్తూ నృత్య బంగిమలతో మహిళల కోలాటాలను భక్తులు తన్మయంతో తిలకిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా వెంకటేశ్వర కళా పరిషత్ ఆధ్వర్యంలో కోలాటాల బృందం ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడికి పరామర్శ

నింద్ర, జూన్ 18: అనారోగ్యంతో అమర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నింద్ర సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ఆర్ఎస్ వెంకటేశ్వర్లు నాయుడిని మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పి.విజయబాబు పరామర్శించారు. ఆయన వెంట పరమేశ్వరమంగళం సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు రవి నాయుడు తదితరులున్నారు.

